ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

# vaartha sandhya వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 132 గురువారం 30 - 04 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 132 Thursday 30 - 04 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం



2 లో

మే 10న తెలంగాణలో పర్యటించనున్న మోదీ

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ

3 లక్షల మందిని సభకు తరలించే లక్ష్యంలో బీజేపీ శ్రేణులు

**వార్త సంధ్య, ఢిల్లీ, ఏప్రిల్ 30 :**

మే 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. కేంద్రంలో మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని తొలిసారిగా తెలంగాణకు వస్తుండటంతో, దీనిని ఒక చారిత్రాత్మక - మిగతా 2 లో

## ఇరాన్ ఎంబసీ పోస్టు.. రాయబారికి యూకే సమన్లు





2 లో

యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని ఇరాన్ పోస్టు

దేశాన్ని శత్రువులకు అప్పగించే బదులు ప్రాణాలు అర్పిద్దామని పిలుపు

ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టు ఆందోళనకరమైనదనే అభిప్రాయాలు

రాయబారికి సమన్లు జారీ చేసిన యూకే ప్రభుత్వం

**వార్త సంధ్య, ఢిల్లీ, ఏప్రిల్ 30 :**

యూకేలోని ఇరాన్ రాయబార కార్యాలయం, ఆ దేశంలో నివసిస్తున్న ఇరానీయులను ఉద్దేశించి చేసిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. ఇరానీయులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలని 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని, దేశాన్ని వారికి అప్పగించే బదులు మనమంతా ప్రాణాలను అర్పిద్దామని యూకేలో నివసిస్తున్న - మిగతా 2 లో

## రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు దానవీరశూరకర్ణ, ఎన్నికల తర్వాత కుంభకర్ణ: కేటీఆర్



2 లో..

- రేవంత్ రెడ్డి తాను మారిన మనిషినని చెబుతున్నారన్న కేటీఆర్
- ఎన్నికల తర్వాత కుంభకర్ణుడయ్యాడు కాబట్టి ఆయన చెప్పింది నిజమేనని చురక
- ఈ దుర్మార్గపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకోవాలన్న కేటీఆర్

**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 30 :**

తాను మారిన మనిషినని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అయితే ఆయన చెప్పినదాంట్లో నిజం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీరశూర కర్ణ అయితే, ఎన్నికల తర్వాత కుంభకర్ణుడు అయ్యాడని ఎద్దేవా చేశారు. కల్వకుర్తి నియోజక వర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీలకు నాయకులు - మిగతా 2 లో

## ధరల పెరుగుదల వదంతులతోనే రాష్ట్రంలో ఇంధన కొరత ఏర్పడిందన్న మంత్రి

అసాధారణ డిమాండ్ కారణంగా బంకుల్లో ఖాళీ అవుతున్న స్టాక్

సరఫరాను 126 శాతానికి పెంచి పరిస్థితిని చక్కదిద్దుతున్నామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

రైతులకు, లారీ యజమానులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక చర్యలు

ఆందోళన వద్దు, నిల్వలు సరిపడా ఉన్నాయని ప్రజలకు ప్రభుత్వం భరోసా

**ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దు**



**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 30 :**

తెలంగాణలో గత మూడు రోజులుగా పలు ప్రాంతా ల్లో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఇంధన ధరలు భారీగా పెరగబోతున్నాయంటూ వ్యాపించిన వదంతుల వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేస్తుండటంతో బంకుల వద్ద భారీ రద్దీ ఏర్పడి, డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని వివరించారు. ఈ పరిస్థితికి పలు కారణాలు దోహదం చేశాయని ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన రేకెత్తించింది. - మిగతా 2 లో

## నేను మంత్రి పదవి అడగలేదు



- తనకు మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదన్న కోదండరాం
- కేసీఆర్ హయాంలో అందరూ భయంతో బతికారని వెల్లడి
- మార్పు కోసమే తాము పార్టీ నడుపుతున్నామన్న టీజేఎస్ అధినేత

**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 30 :**

తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదని, తాను కూడా అడగలేదని టీజేఎస్ అధినేత కోదండరాం స్పష్టం చేశారు. అయితే, తన పార్టీ నాయకులకు ప్రభుత్వం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు ఇస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన బహిరంగంగానే చెప్పారు. - మిగతా 2 లో



## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

**రూ. 36,230 కోట్లతో గంగా ఎక్స్‌ప్రెస్‌వే.. జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ**

- ఉత్తరప్రదేశ్‌లో గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోదీ
- రూ. 36,230 కోట్ల వ్యయంతో 594 కిలోమీటర్ల పొడవున 6 లేన్ల రహదారి నిర్మాణం
- మీరట్-ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గింపు
- యూపీ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కొత్త జీవనాడిగా మారుతుందని ప్రధాని వ్యాఖ్య
- షాజహాన్‌పూర్ జిల్లాలో 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ స్ట్రిప్ ఏర్పాటు

**వార్త సంధ్య, ఢిల్లీ, ఏప్రిల్ 30 :**

ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త జీవనాడిలా మారే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. హర్దోయ్‌లో జరిగిన ఒక బహిరంగ స భలో, సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మిం చిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఆయన జాతికి అంకితం చేశారు. గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊతమిస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ - మిగతా 2 లో

## ఢిల్లీ హైకోర్టులో వర్చువల్ కేసు విచారణలో.. ప్లే అయిన అశ్లీల వీడియోలు





2 లో

వర్చువల్ విచారణ రెండుసార్లు నిలిపివేత

హైకోర్టు వీడియో కాన్ఫరెన్సింగ్ ఇంటర్‌ఫేస్‌ను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడి

వర్చువల్ విచారణలోకి లాగ్-ఇన్ అయి వీడియోలను ప్లే చేసినట్లు గుర్తింపు

## ఉద్యమకారుడైన తండ్రిని విమర్శించి కవిత మర్యాద పోగొట్టుకున్నారు

తండ్రికి విలువ ఇవ్వని ఆమె తెలంగాణ అమ్మ ఎలా అవుతుందని ప్రశ్న

డబ్బులుంటే పార్టీ పెట్టడం పాన్ షాప్ పెట్టినంత సులభమైపోయిందని ఎద్దేవా

అన్నమీద కోపంతో తండ్రిని విమర్శించడం సరికాదని వ్యాఖ్య



**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 30 :**

తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత తన తండ్రి కేసీఆర్‌ను విమర్శించి మర్యాద పోగొట్టుకున్నారని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఉద్యమకారుడని, అలాంటి వ్యక్తిని తన మొదటి సమావేశంలోనే విమర్శించడం బాధేసిందని అన్నారు. - మిగతా 2 లో

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం



- నారా లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించిన చంద్రబాబు
- ప్రమాణస్వీకారం చేసిన పొలిట్ బ్యూరో, ఇతర కమిటీల నేతలు
- మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమం

**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 30 :**

తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. లోకేశ్ తో పాటు పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలతో కూడా చంద్రబాబు ప్రమాణం చేయించారు. - మిగతా 2 లో

## పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా.. అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు

**: టీడీపీ నేతలకు చంద్రబాబు వార్నింగ్**



- అధికారం ఉందని ఇగోలకు పోవద్దు.. సొంత పార్టీ నేతలకు చంద్రబాబు హెచ్చరిక
- సొంత బాబాయిని చంపి నెపం మనపై నెట్టారని వైసీపీపై తీవ్ర విమర్శలు
- జనసేన, బీజేపీతో సమన్వయం అవసరం.. కేంద్రంతో గ్యాప్ రాకూడదని స్పష్టీకరణ
- ఫ్లెక్సీలు, కుర్చీల కోసం గొడవలు పడొద్దని కార్యకర్తలకు హితవు
- త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 30 :**

టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సొంత పార్టీ నేతలకు, కార్యకర్తలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న అహంతో ఎవరూ ఇగోలకు పోవద్దని, క్రమశిక్షణ తప్పితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకార - మిగతా 2 లో

## 'విశాఖలో గూగుల్'పై సాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు.. ఎకరా 99 పైసలకు ఓకే.. కానీ!



2 లో

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతించిన విజయసాయిరెడ్డి

ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని ప్రభుత్వానికి సూచన

రాజకీయ ప్రసంగాల కన్నా ఉపాధి హామీపై మాట్లాడితే బాగుండేదని హితవు

99 పైసలకే భూములు ఇచ్చినా, భారీగా ఉపాధి కల్పిస్తేనే ప్రయోజనం అని వ్యాఖ్య

**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 30 :**

ఏపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనదైన శైలిలో స్పందించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతిస్తూనే, ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. ప్రోత్సాహకాలు, భూముల కేటాయింపులకు బదులుగా రాష్ట్ర యువతకు శాశ్వత ఉపాధి లభించేలా స్పష్టమైన హామీ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. - మిగతా 2 లో

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# సంపాదకీయం

## ఇంధన సంక్షోభం.. ఏదీ ప్రత్యామ్నాయం?

అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధమేఘాల కారణంగా నేడు మన దేశం నూటికి 80 శాతం ముడి చమురు, 56 శాతం సహజ వాయువును విదేశాలపై ఆధారపడి దిగుమతి చేసుకుంటున్న మూలంగా వీటి సరఫరాలకి తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. దేశ ఆర్థిక ప్రగతికి కీలకమైన ఇంధన రంగాలు ఇలా విదేశాలపై ఎక్కువగా ఆధారపడటం ఎంతటి విపరిణామాలకి దారి తీస్తుందో 199091 లో కువైట్ ఇరాక్ యుద్ధంవల్ల మనకి కొంత బోధపడింది. అయినా మన దేశ పాలకులు తగిన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవటంలో అలసత్వం వహిస్తూ ఉన్నారు. దీని మూలంగా నేడు దేశంలో అధిక జనాభా పెరుగుదల మరింత ఇంధన వనరుల అవసరత పెరగటంతో ఈ అమెరికా ఇరాన్ యుద్ధం మూలంగా మన దేశం ఇంధన సంక్షోభంలో నుండి ఇంధన విపత్తులోకి నెట్టివేయబడుతోంది. మన దేశంలో ఎల్‌పిజి గ్యాస్ ఉత్పత్తి 2014 15 లో 9.8 మిలియన్ టన్నుల ఉంటే అదే వినియోగం 18 మిలియన్ టన్నులు. ఇక 202021 లో ఉత్పత్తి 12.8 మిలియన్ టన్నులకి పెరిగింది. అదే వినియోగం 27.6 మిలియన్ టన్నులకి చేరింది. నేడు 202425 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి 13 మిలియన్ టన్నులు ఉంటే వినియోగమేమో ఏకంగా 31.2 మిలియన్ టన్నులుగా నమోదైంది. ఇలా మన దేశంలో సహజ వాయువు నిల్వలు తక్కువగా ఉన్నందున దేశీయ స్వయం ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. మరి అవసరాలేమో గృహ, వాణిజ్య అవసరాలకి కిరోసిన్, కట్టెలు, పిడకలు వినియోగం తగ్గుతూ స్వచ్ఛ ఇంధనంగా సులువుగా ఆహార పదార్థాలు తయారీకి అనువుగా ఉన్న ఎల్‌పిజి గ్యాస్‌ని ప్రభుత్వాలే రాయితీలు, సబ్సిడీలు ఇస్తూ ప్రోత్సహించాయి. తదనుగుణంగా ఎల్‌పిజి వినియోగం పెరగటంతో విదేశాలపై ఆధారపడి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోవాల్సిన వస్తోంది. 'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సస్టయినబుల్ డెవలప్‌మెంట్' 2026 ఫిబ్రవరిలో ఇచ్చిన నివేదిక ప్రకారం 2012 13 లో 5.8 మిలియన్ టన్నుల ఎల్‌పిజిని మనం దిగుమతి చేసుకుంటే, 2018 19లో 13.5 కి పెరిగి, 202425 లో 20.7 మిలియన్ టన్నుల ఎల్‌పిజి దిగుమతికి పెరిగింది. దీని వల్ల మన దేశంలో 2024 25లో ఒక లక్ష 12వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం (ఫోరెక్స్)ని కోల్పోయింది.ఇలా ప్రతి ఏటా ఎల్‌పిజి ధరల పెరుగుదల మూలంగా దేశం 80 వేల కోట్ల నుంచి ఒక లక్ష కోట్లని గ్యాస్ ఎగుమతి దేశాలైన ఖతార్, యుఎఇ, రష్యా, సౌదీ అరేబియా, కువైట్, ఒమన్ దేశాలకు చెల్లించాల్సి వస్తోంది. 201415 లో దేశంలో ఎల్‌పిజి సిలిండర్లు గృహ కనెక్షన్స్ 14.52 కోట్లు ఉంటే, 202425 నాటికి 33 కోట్లకి చేరాయి. దీనిని ప్రధాన కారణం 2016 మే నెల 1వ తేదీన భారత ప్రధానమంత్రి దారిద్ర్యరేఖకి దిగువనున్న మహిళలకు ఉచితంగా ఎల్‌పిజి సిలిండర్స్ కనెక్షన్ పథకాన్ని ప్రారంభించడమే. (ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) పథకం ద్వారా 2016 నుండి 2026 10 కోట్ల (కొత్త కనెక్షన్స్ చేరి మొత్తంగా దేశంలో నేడు 33 కోట్ల ఎల్‌పిజి సిలిండర్స్ కనెక్షన్స్ నమోదయ్యాయి. 216 బాట్లింగ్ ప్లాంట్స్, 25 వేల అధీకృత డిస్ట్రిబూషన్ సెంటర్స్ కలిగి విపత్కర పరిస్థితుల్లో కేవలం 18 రోజులకే సరిపడ నిల్వలు ఉన్నాయి. భారత్‌కి ఖతార్‌తో సహజ వాయువు సరఫరా కోసం దీర్ఘకలిక ఒప్పందం ఉంది. ఇక యుఎఇ దేశం భారత్‌కి నాలుగవ అతి పెద్ద ముడిచమురు ఎగుమతిదారు, పైగా రెండో అతి పెద్ద ఎల్‌పిజి సరఫరాదారు కూడా. అందుకే అమెరికా కాల్పుల విరమణ సమయంలో హుటాహుటిన మన దేశ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ యుఎఇకి వెళ్లారు. మన దేశ పెట్రోలియం, సహజ వాయువు కేంద్ర మంత్రి హర్దీప్ సంగ్ ఖతార్‌కి వెళ్లి దేశ ఇంధన భద్రతతోపాటు, మన ప్రవాస భారతీయులు, కార్మికుల భద్రత సంక్షేమం తదితర అంశాలపై చర్చలు జరిపి రావడం ప్రాముఖ్యత సంతరించుకుంది. పశ్చిమాసియాలో శాంతి ప్రక్రియకి భారత్‌తోపాటు జపాన్, సౌత్‌కొరియా దేశాలు కీలక పాతర పోషించాలని ప్రయత్నాలు ముమ్మరం చేయటంతో మన దేశ ఇంధన భద్రతకి భరోసా కల్పిస్తున్నట్లుగా వాతావరణం కనిపిస్తున్నది. అయితే శాశ్వత పరిష్కారానికి, స్వావలంబనకి ప్రత్యామ్నాయాలు మెరుగుపర్చాల్సి ఉంది. ఐఐసిటి (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) వారు మన దేశంలో బొగ్గు నిల్వలు అపారంగానే ఉన్నందున కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియ ద్వారా డిఎంఇ (డైమిథైల్ ఈథర్)ని ఉత్పత్తి చేసి మనం నిత్యం వినియోగించే ఎల్‌పిజిలో కలపడం మూలంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని సూచిస్తున్నారు. బిఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్) వారు ఎల్‌పిజిలో ఈ డైమిథైల్ ఈథర్‌ని 20 శాతం మేర వినియోగిస్తే మంచిదే అని అనుమతించారు కూడా. అంతేగాక దీని వలన ప్రతి ఏటా 6.3 మిలియన్ టన్నుల ఎల్‌పిజి దిగుమతి భారం తగ్గి మన దేశానికి అమూల్యమైన విదేశీ మారక నిల్వల నిధులు ప్రతియేటా 4.04 అమెరికన్ బిలియన్ డాలర్లు అంటే (34,200 కోట్ల రూపాయలు) ఆదా అవుతాయని అంచనా వేశారు. ఈ గ్యాస్‌ని రెండు పద్ధతుల్లో తయారు చేయవచ్చు. నేరుగా బొగ్గుని ముడి పదార్థంగా వినియోగించే సింగిల్ రియాక్టర్ క్యాటలిటిక్ ప్రాసెస్‌లో డెరెక్ట్‌గా కోల్ గ్యాసిఫికేషన్ ఆధార్ షిన్‌గ్యాస్ నుండి ఈ 'డై మిథైల్ ఈథర్'ని ఉత్పత్తి చేస్తారు. ఇక ఇన్‌డైరెక్ట్ విధానంలో అయితే మొదట షిన్ గ్యాస్ నుండి మిథనాల్ ఆ తరువాత ఈ 'డైమిథైల్ ఈథర్‌ని ఉత్పత్తి చేస్తారు. కాలుష్యం కూడా తక్కువే.. అని. "Cool gosification for energy and chemical secuity" by EY parthenon and new era ceantech solution Ltd... 2026 ఏప్రిల్‌లో తెలిపింది. వంటగ్యాస్ ఉత్పత్తిలో ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధిస్తే, సమగ్ర సుస్థిరాభివృద్ధికి అదో చక్కటి చోదకశక్తి వనరుగా ఉంటుంది. వికసిత్ భారత్ 2047 విజన్ ఈ పథకాన్ని చేర్చాల్సి ఉంది.

## మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం

**మొదటిపేజీ తరువాయి –** విజయ సంకేతంగా మలిచేందుకు రాష్ట్ర బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా రాష్ట్ర బీజేపీ నేతలు నామకరణం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, విపక్ష బీఆర్ఎస్ వైఫల్యాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను (ఆగ్రహాన్ని) ఓట్లుగా మలుచుకోవాలన్నది బీజేపీ ఉద్దేశ్యం. ఈ సభను రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా నిర్వహించేందుకు బీజేపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. సుమారు 3 లక్షల మందిని సభకు తరలించడం ద్వారా అటు కాంగ్రెస్‌కు, ఇటు బీఆర్ఎస్‌కు తమ బలాన్ని చాటాలని భావిస్తున్నారు. మరోవైపు, కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, నేషనల్ హైవేల విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ద్వారా 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఆవశ్యకతను ప్రధాని నొక్కి చెప్పనున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో పట్టు సాధించేందుకు మోదీ పర్యటనను ఒక గొప్ప అవకాశంగా వాడుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని ప్రస్తావించడం ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించే అవకాశం ఉంది.

## ఇరాన్ ఎంబసీ పోస్టు.. రాయబారికి యూకే సమన్లు

**మొదటిపేజీ తరువాయి –** తమ పౌరులకు పిలుపునిచ్చింది. దేశంకోసం ఆత్మబలిదానానికి సిద్ధంగా ఉండాలని, అలాంటివారు తమను సంప్రదించాలని కోరింది. అయితే ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టుపై విమర్శలు వస్తున్నాయి. ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టు అనుచితమైనదని, ఆందోళనకరమైనదనే వ్యాఖ్యలు విని పిస్తున్నాయి. ఇరాన్ దౌత్య కార్యాలయం చేసిన పోస్టు, ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని యూకే అధి కారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పోస్టు చేసినందుకు ఆ దేశ రాయబారి సయ్యద్ అలీ మౌసా వినికి సమన్లు జారీ చేశారు. అయితే ఇరాన్ రాయబార కార్యాలయం తమ పోస్టును సమర్థించుకోవడం గమనార్హం. ఇది దేశభక్తికి, దేశంపై విధేయతకు సంబంధించినదని పేర్కొన్నారు. హింసను ప్రోత్స హిస్తున్నట్లు కాదని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానీయులు ఎల్లప్పుడూ తమ మాతృభూమి పరిరక్షణకు ముందుంటారని తెలిపింది. యుద్ధంలో ప్రాణత్యాగానికి తనతో సహా ఇరాన్ పౌరులు సిద్ధంగా ఉండాలని ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## నేను మంత్రి పదవి అడగలేదు

**మొదటిపేజీ తరువాయి –** కేసీఆర్ హయాంలో ప్రజలు మరియు నాయకులు ఒక రకమైన 'భయం' నీడలో బతికారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, "ఇంట్లో ఫోన్ పెట్టి జాగ్రత్తగా రమ్మనే పరిస్థితి ఉండేది" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రజల నుంచి దూరమయ్యారని, అందుకే ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక కవిత కొత్త పార్టీ పెట్టిన నేపథ్యంలో స్పందిస్తూ.. ఆమె తన మాటల ద్వారా కుటుంబ లోపాలను బయటపెడుతున్నారని, పార్టీ అంటే కేవలం కుటుంబమే అని ఆమె చర్యలు నిరూపిస్తున్నాయని విమర్శించారు. తాము కేవలం ఎన్నికల కోసం కాకుండా 'మార్పు' కోసం పార్టీని నడుపుతున్నామని, అయితే అన్ని ఎన్నికలకూ దూరంగా ఉండలేమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో (బహుశా మున్సిపల్ లేదా జీహెచ్ఎంసీ) కచ్చితంగా పోటీ చేస్తామని, ముందుగానే నియోజకవర్గాలను ఎంచుకుని పనిచేస్తామని ప్రకటించారు.

## ఢిల్లీ హైకోర్టులో వర్చువల్ కేసు విచారణలో.. ప్లే అయిన అశ్లీల వీడియోలు

**మొదటిపేజీ తరువాయి –**

ఢిల్లీ హైకోర్టులో ఓ కేసు విచారణ జరుగుతున్న సమయంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. ఓ కేసు వర్చువల్ విచారణ జరుగుతుండగా ఒక్కసారిగా అశ్లీల వీడియోలు ప్లే అయ్యాయి. దీనితో వర్చువల్ విచారణను రెండుసార్లు నిలిపివేయాల్సి వచ్చింది. అయితే, గుర్తు తెలియని వ్యక్తి ఈ విచారణలోకి వచ్చి వీటిని ప్లే చేసినట్లు వెల్లడైంది. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ కోర్టులో బెంచ్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఓ కేసును విచారిస్తుండగా, మధ్యలో అశ్లీల వీడియోలు కనిపించాయి. ఆందోళనకు గురైన అధికారులు విచారణను వెంటనే నిలిపివేశారు. తిరిగి విచారణ చేపట్టినప్పటికీ మరో రెండుసార్లు అలాగే అశ్లీల వీడియోలు కనిపించాయి. ఆ తర్వాత "మీరు హ్యాక్ అయ్యారు" అనే సందేశం కనిపించింది. దీంతో వర్చువల్ విచారణను పూర్తిగా నిలిపివేశారు. ఢిల్లీ హైకోర్టు వీడియో కాన్ఫరెన్సింగ్ ఇంటర్‌ఫేస్‌ను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి వర్చువల్ విచారణలోకి లాగ్-ఇన్ అయి వీడియోలను ప్లే చేసినట్లు గుర్తించారు. శ్రీధర్ సర్నోబత్, షిత్‌జీత్ సింగ్ అనే పేర్లతో లాగ్-ఇన్‌లో ఉన్న రెండు ఖాతాల నుంచి అశ్లీల కంటెంట్ ప్లే అయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

**మొదటిపేజీ తరువాయి -** "గంగామాత ఈ దేశానికి, యూపీకి ఎలా జీవనాడిగా ఉందో, అలాగే ఈ ఎక్స్‌ప్రెస్‌వే కూడా రాష్ట్ర అభివృద్ధికి కొత్త జీవనాడిగా మారుతుంది. ఈ రహదారికి గంగా మాత పేరు పెట్టడం సంతో షంగా ఉంది. ఇది మన అభివృద్ధి దార్శనికతతో పాటు మన గొప్ప వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వే తో ప్రయాగ్‌రాజ్‌లోని సంగం, కాశీలోని బాబా విశ్వ నాథుడి దర్శనం గంటల వ్యవధిలోనే సాధ్యమవుతుందని ఆయన వివరించారు.



ప్రాజెక్టు ముఖ్యాంశాలు

ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే 594 కిలోమీటర్ల పొడవైన 6-లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే. భవిష్యత్తులో దీనిని 8 లేన్లకు విస్తరించవచ్చు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను కలుపుతూ మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు 12 జిల్లాల గుండా వెళుతుంది. దీనివల్ల మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రస్తుతం 10 నుంచి 12 గంటలుగా ఉన్న ప్రయాణ సమయం కేవలం 6 గంటలకు తగ్గుతుంది. ఈ ప్రాజెక్టులో మరో కీలకమైన అంశం షాజహాన్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఎయిర్‌స్ట్రిప్). ఇది దేశ రక్షణ సన్నద్ధతకు, వ్యూహాత్మక అవసరాలకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఈ రహదారి వెంట పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. ఇది పరిశ్రమలను ఆకర్షించడం, రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి బహుళ ప్రయోజనాలను అందిస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఆగ్రా-లక్నో వంటి ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలతో ఈ రహదారి అను సంధానమై, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది.

# పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా.. అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు

**మొదటిపేజీ తరువాయి -** కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. పార్టీ నేతలు, కార్యకర్తల ప్రవర్తనపై కీలక సూచనలు చేస్తూనే, మరోవైపు వైసీపీపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.

### అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరు

"ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు నన్ను తీవ్ర మనస్తాపానికి గురి చేశాయి. మనం సుపరిపాలన అనే యజ్ఞం చేస్తుంటే, మన నేతలే సరిగా వ్యవహరించకుంటే బాధ కలుగుతుంది. ప్రజలతో సౌమ్యంగా ఉండాలి, వారికి అందుబాటులో ఉండాలి. నేతలు, కార్యకర్తలు చేసే తప్పులు పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయి"

అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు, ఫొటోలు, కుర్చీల దగ్గర చిన్నపాటి గొడవలు కూడా రాకూడదని, అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరని హితవు పలికారు. గత పాలకుల గర్వాన్ని, అహంకారాన్ని చూసే ప్రజలు వారికి బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. బూతులు, దాడులు, సెటిల్మెంట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

### మిత్రపక్షాలతో సమన్వయం అత్యవసరం

కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన, బీజేపీ నేతలతో సమన్వయంతో ముందుకు సాగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను, పవన్ కల్యాణ్ ఎంతో చక్కగా ఉంటున్నాం. మంచి సంబంధాలు కొనసాగిస్తున్నాం. ఇదే స్ఫూర్తి క్షేత్రస్థాయిలోనూ కనిపించాలి. బీజేపీని కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య గ్యాప్ లేదు, రాకూడదు" అని ఆయన పేర్కొన్నారు. తాను లేకుండా ఎంపీ రాకూడదని ఎమ్మెల్యేలు అనడం సరైన పద్ధతి కాదని, అందరూ మనస్పర్థలు లేకుండా పనిచేయాలని సూచించారు.

### నేరస్థులతో పోరాడుతున్నాం

ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నా రాజకీయ జీవితంలో ఎంతోమంది నేతలతో పోరాడాను. కానీ తొలిసారిగా నేరస్థులతో పోరాడుతున్నాం. సొంత బాబాయి వివేకాను హత్య చేసి ఆ నెపాన్ని మనపై నెట్టారు. తమ కార్యకర్తను కారుతో తొక్కించి ఆ పాపాన్ని కూడా మనకే అంటించారు. కబ్జా చేసిన ఆస్తుల కోసం కడపలో అనుచరుడినే చంపేశారు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. వాస్తవాలు బయటపడితే ఎదురుదాడి చేయడం వారికి అలవాటని విమర్శించారు. మనది అభివృద్ధి అయితే వాళ్లది అవినీతి అని, మనది వికాసం అయితే వాళ్లది విధ్వంసమని అన్నారు.

### భవిష్యత్ ఎన్నికలే లక్ష్యం

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమికి ఓటేశారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం సాధించాలని పిలుపునిచ్చారు.

"మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయి. 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలి. అప్పుడే మనం బాగా పనిచేసినట్టు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దు, మళ్లీ మళ్లీ గెలవాలి. పనిచేసిన వారికే పదవులు వస్తాయి" అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి పార్టీ ప్రతిష్టను పెంచాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు దానవీరశూరకర్ణ, ఎన్నికల తర్వాత కుంభకర్ణ: కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి -** బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఆయన పాలమూరు బిడ్డ, ఇప్పుడు కనీసం పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని బిడ్డ అని ఎద్దేవా చేశారు. నాగర్ కర్నూలు, పాలమూరులలోనే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే సిగ్గనిపించడం లేదా అని మండిపడ్డారు. విద్యుత్ ఇవ్వడం లేదని, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, రైతు బంధు ఖాతాల్లో పడటం లేదని, వీటికి ఆయనకు సిగ్గనిపించడం లేదా అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు తిడుతుంటే తనకు పైశాచిక ఆనందం వస్తుందని రేవంత్ రెడ్డి చెబుతుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల్లో ఉండే సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. మరో సంవత్సరం తర్వాత రేవంత్ రెడ్డి చెబితే, కూర్చున్న కుక్క కూడా లేవదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ దుర్మార్గపు, అరాచకపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకుంటే, చివరి ఏడాది అంతా ఎన్నికల హడావుడి ఉంటుందని అన్నారు.


## ధరల పెరుగుదల వదంతులతోనే రాష్ట్రంలో ఇంధన కొరత ఏర్పడిందన్న మంత్రి

**మొదటిపేజీ తరువాయి -** దీనికి తోడు పారిశ్రామిక అవసరా లకు వాడే డీజిల్ ధర లీటరుకు రూ.150కి చేరడంతో ఆ వినియోగదారులు కూడా తక్కువ ధరకే లభించే సాధారణ బంకులపై ఆధారపడుతున్నారు. ఇదే సమయంలో ఏపీ, మహారాష్ట్ర వంటి సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు కూడా తెలంగాణలోని బంకుల్లోనే ఇంధనం నింపు తుండటంతో డిమాండ్ అనూ హ్యంగా పెరిగింది. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్లే అమ్ముడై పోయి, బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమి చ్చాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సరఫరాను సాధారణం కంటే 126 శాతం పెంచినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర చమురు కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,100 ట్యాంకర్లను నిరంతర సరఫరా కోసం రంగంలోకి దించారు. ఈ నెల 27వ తేదీ నాటికి రోజువారీ డీజిల్ పంపిణీ 151 శాతం, పెట్రోల్ పంపిణీ 95 శాతానికి పెరిగింది. ప్రస్తుతం పంట కోతలు, ధాన్యం కొనుగోళ్ల సమయం కావడంతో రైతులకు, రవాణా రంగానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల్లోని నిల్వలను సమీక్షిస్తూ, కొరత ఉన్న ప్రాంతాలకు తక్షణమే ట్యాంకర్లను పంపిస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని, రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

## ఉద్యమకారుడైన తండ్రిని విమర్శించి కవిత మర్యాద పోగొట్టుకున్నారు

**మొదటిపేజీ తరువాయి -** కవిత తన పార్టీ ప్రకటన సమయంలో పలుమార్లు తనను తాను అమ్మగా చెప్పుకున్నారని, కానీ తండ్రికి విలువ ఇవ్వని ఆమె తెలంగాణకు అమ్మ ఎలా అవుతారని ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, డబ్బులు ఉంటే పార్టీ పెట్టడం పాన్ షాప్ పెట్టినంత సులభమైపోయిందని వ్యాఖ్యానించారు. కవితతో "ఊదు కాలదు, పీరు లేవదు" అని తెలంగాణలోని నానుడిని పేర్కొన్నారు. అన్నమీద ఉన్న కోపాన్ని కవిత తన తండ్రి మీద చూపించడం సరికాదని అన్నారు. ఉద్యమకారుడి బిడ్డగా కవితకు గుర్తింపు ఉందని, కానీ ఆమె పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాదని అన్నారు. టీఆర్ఎస్ పేరు మీదే పార్టీ పెట్టడం హాస్యాస్పదమని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు క్లీన్ చిట్ రాలేదని ఆయన తెలిపారు. తనకు మంత్రి పదవి అంశంపై కూడా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. అధిష్ఠానం తనకు హామీ ఇచ్చిందని అన్నారు. తనను మంత్రివర్గంలోకి తీసుకుంటే ఆ పదవికి తప్పకుండా న్యాయం చేస్తానని అన్నారు.

## 'విశాఖలో గూగుల్'పై సాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు.. ఎకరా 99 పైసలకు ఓకే.. కానీ!



**మొదటిపేజీ తరువాయి –** విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రసంగంపై విజయసాయిరెడ్డి స్పందించారు. ఇలాంటి వేదికలపై రాజకీయ ప్రసంగాలు చేయడం కన్నా, గూగుల్ ద్వారా రాష్ట్ర యువతకు ఎంతకాలంలో, ఏయే విభాగాల్లో, ఎన్ని ఉద్యోగాలు వస్తాయో స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించి ఉంటే బాగుండేదని ఆయన ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఐటీ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కోతలు (లే ఆఫ్స్) ఉన్నాయని గుర్తుచేస్తూ, ఇలాంటి తరుణంలో ఉపాధిపై ప్రభుత్వ భరోసా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలకు ప్రభుత్వం ఎకరా 99 పైసలకే భూములు కేటాయించడంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వం కల్పించే రాయితీలు, ప్రోత్సాహకాలు రాష్ట్ర ప్రజలకు నిరంతరం, భారీ స్థాయిలో ఉపాధిని కల్పించేలా ఉండాలని షరతు పెట్టారు. అప్పుడే అది ప్రజా ప్రయోజనాల కోసం జరిగిన ఒప్పందంగా పరిగణించవచ్చని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించేందుకు పలు కంపెనీలకు భారీ ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్, విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు ఇప్పటికే శంకుస్థాపనలు జరిగాయి. ఈ క్రమంలోనే పలు ఐటీ కంపెనీలకు విశాఖలో ఎకరా భూమిని కేవలం 99 పైసలకే కేటాయించారు. ఇటీవల వైసీపీకి, తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి రాజకీయాలకు విరామం ప్రకటించారు. అయితే, త్వరలోనే మళ్లీ రాజకీయాల్లోకి రీ-ఎంట్రీ ఇస్తానని ప్రకటించిన ఆయన, ప్రస్తుతం ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ చురుగ్గా ఉంటున్నారు.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

**మొదటిపేజీ తరువాయి -** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. యువతకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూనే, అనుభవజ్ఞులైన నేతలను పొలిట్ బ్యూరోలో కొనసాగించడం ద్వారా 'పాత-కొత్త' కలయికను సమర్థవంతంగా అమలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం ద్వారా, సాధారణ కార్యకర్త కూడా ఉన్నత స్థాయికి ఎదగగలడనే బలమైన సంకేతాన్ని పార్టీ పంపింది. ఇకపై ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ లోకేశ్ పాత్ర ఇప్పుడు మరింత కీలకం కాబోతోంది. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు కనిపిస్తోంది. పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈ భారీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

**కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది ఒకటని విమర్శ**

**వరిధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించలేదని విమర్శ**


**సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది మరొకటని విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్ అని ఆరోపించారు. పంటల కొనుగోళ్లకు సంబంధించి ఆయన ఈ లేఖను రాశారు. గతంలో తాలు పేరిట తరుగు తీస్తే తోలుతీస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్రాల్లోకి వెళ్లి చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా, ఇంకా కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మిల్లుల దగ్గర కూడా బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులను దోచు కుంటున్నారని ఆరోపించారు. ఎండల్లో రైతులు మాడిపోతున్నా ప్రభుత్వానికి సోయిలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొద్దుతిరుగుడు రైతుల కష్టాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పట్టదా? అని నిలదీశారు. 20 రోజులుగా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కేంద్రం కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు పంట పావు వంతు మాత్రమేనని అన్నారు. మిగిలిన 1.20 లక్షల క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శనగ రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు శనిలా మారాయని అన్నారు. అనవసర కారణాలతో కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేశారని అన్నారు. శనగలకు మద్దతు ధర రూ.5,875 ఉంటే, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు మూడు నాలుగు వేల రూపాయలకే రైతులు అమ్ముకునే దుస్థితి వచ్చిందని అన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర రూ.3,370 ఉంటే ప్రైవేటు వ్యక్తులకు రూ.2,500కు రైతులు అమ్మవలసిన పరిస్థితి వస్తోందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు నిబంధనను సడలించాలని కోరారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హరీశ్ రావు పేర్కొన్నారు.

## తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1,000 కోట్ల బకాయిలు విడుదల

తెలంగాణ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్తను అందించింది. వారి బకాయిల కోసం వెయ్యి కోట్ల రూపాయలను విడుదల చేసింది. గత సంవత్సరం అక్టోబర్ వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను క్లియర్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో జాప్యంపై ఇటీవల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.1000 కోట్ల నిధులను విడుదల చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల, జీపీఎఫ్ బకాయిలను ప్రభుత్వం పూర్తిగా క్లియర్ చేసింది. 2025 అక్టోబర్ వరకు ఉన్న అన్ని బకాయిలను ఒకేసారి విడుదల చేసింది. ఈ బకాయిల విడుదలతో పాటు భవిష్యత్తులో చెల్లింపుల ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి నెలా చేసే చెల్లింపుల పరిమితిని మరో రూ.1,000 కోట్లకు పెంచుతూ ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. దీనితో ఉద్యోగులకు సంబంధించిన క్లెయిమ్స్, బిల్లులు ఇకపై పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే వీలుంటుంది.

## మోదీ ఫుట్‌బాల్ ఆట.. ప్రధాని క్రీడా స్ఫూర్తి అద్భుతమంటూ ఫిఫా అధ్యక్షుడి ప్రశంసలు



ప్రధాని నరేంద్ర మోదీ క్రీడా స్ఫూర్తిపై అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) అధ్యక్షుడు జియాన్నీ ఇన్ఫాంటినో ప్రశంసలు కురిపించారు. సిక్కిం పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ చిన్నారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడు తున్న ఫొటోను ఆయన తన ఇన్‌స్టా గ్రామ్ ఖాతాలో పంచు కున్నారు. మంగళవారం గ్యాంగ్ టక్‌లో పర్యటించిన ప్రధాని మోదీ, అక్కడి చిన్నారులతో సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఇది తనకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని, ఆ యువ మిత్రులతో గడపడం ఆనందంగా ఉందని 'ఎక్స్' వేదికగా ఫొటోలను పంచుకున్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై స్పందించిన ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినో, బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ ఫొటోను షేర్ చేస్తూ, "ప్రధాని మోదీ మన అందమైన ఆటను ఆడటం చూడటం చాలా బాగుంది. ఫుట్‌బాల్ నిజంగా ప్రపంచాన్ని ఏకం చేస్తుంది" అని క్యాప్షన్ జోడించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఫుట్‌బాల్‌కు విపరీతమైన ఆదరణ ఉన్న విషయం తెలిసిందే. సిక్కిం, మణిపూర్, మిజోరం వంటి రాష్ట్రాల్లో క్రికెట్‌ను మించి ఫుట్‌బాల్‌ను ఇష్టపడతారు. గతంలో కూడా పలు అంతర్జాతీయ వేదికలపై మోదీ, ఇన్ఫాంటినో కలుసుకున్నారు. 2018లో అర్జెంటీనాలో జరిగిన జీ-20 సదస్సులో ఇన్ఫాంటినో.. మోదీ పేరుతో ఉన్న ప్రత్యేక జెర్సీని ఆయనకు బహుమతిగా ఇచ్చారు. వీరిద్దరూ 2024 డిసెంబర్‌లో కువైట్‌లో మరోసారి సమావేశమయ్యారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



## తాడిచెట్టు పైనుండి పడి గీత కార్మికుడు మృతి



**పెద్దపల్లి మంథని ఏప్రిల్, 29 (వార్త సంధ్య) :** మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి లో జక్కుల దేవయ్య అనే గీత కార్మికుడు బుధవారం ఉదయం తాటి చెట్టు పై నుండి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి,కూతురు శైలజ ఉన్నారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గంగాపురిలో నివాసం ఉంటున్న దేవయ్య జీవన ఉపాధి కోసం చెన్నూరు జిల్లా కొమ్మెర గ్రామం నుండి వచ్చి కులవృత్తి చేసుకుంటూ గంగాపురి లో జీవనం కొనసాగిస్తున్నాడు . నిరుపేద గీత కార్మికుడికి ప్రభుత్వం నుండి ఎక్స్గ్రేషియా అందించాలని గౌడ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రజల ముంగిటకే పాలన.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

**3 నెలల్లో దరఖాస్తుల కొలిక్కి కార్యాచరణ**

**పాలేరు ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**ఖమ్మం జిల్లా బ్యూరో ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** ప్రజల సమస్యలను వారి గడప వద్దే పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వెల్లడించిన కీలక అంశాలు ఇవే:

సమస్యలకు డెడ్‌లైన్ : ప్రజల నుంచి వచ్చిన న్యాయబద్ధమైన దరఖాస్తులన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించేందుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించామన్నారు.

క్లస్టర్ విధానం : పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని 3 క్లస్టర్లుగా విభజించి, ప్రతి దరఖాస్తుపై జవాబుదారీతనంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

భూములకు 'భూధార్' : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం మనిషికి ఆధార్ లాగే, ప్రతి భూమికి 'భూధార్' నంబర్ ఇస్తున్నాం అని కూసుమంచి మండలంలో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా బిల్లులు జమ చేస్తున్నాం అని తెలిపారు.

మెగా జాబ్ మేళా : నిరుద్యోగ యువత కోసం మే 4న ఖమ్మంలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. 80కి పైగా కంపెనీలు ఇందులో పాల్గొంటాయి అని తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులకు భరోసా : వరి, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామన్నారు. నిధులను రికార్డు సమయంలో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు.

అధికారులకు ఆదేశం : భూసేకరణ వంటి పెండింగ్ అంశాలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని యంత్రాంగాన్ని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాలు విడుదల

**జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద**

**జిల్లాలో 97.70 శాతం ఉత్తీర్ణత నమోదు**

**రాష్ట్రస్థాయిలో 16వ స్థానం**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** జిల్లాలో 2026 పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.?మార్చి14 నుండి ఏప్రిల్ 15 వరకు జరిగిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 41 కేంద్రాల్లో మొత్తం 7,488 మంది విద్యార్థులు (బాలురు 3674, బాలికలు 3814) హాజరుకాగా, వారిలో 7,316 మంది (బాలురు 3566, బాలికలు 3750) ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.జిల్లాలో 97.70 శాతం ఉత్తీర్ణత నమోదైందని,రాష్ట్ర స్థాయిలో పెద్దపల్లి జిల్లా 16వ స్థానాన్ని కైవసం చేసుకుందని ఆమె వెల్లడించారు.?పదవ తరగతి ఫలితాల సాధనలో కృషి చేసిన ప్రధానోపాధ్యాయులకు, విషయ బోధన ఉపాధ్యాయులకు, పాఠశాల విద్యాశాఖ సిబ్బందికి జిల్లా విద్యాశాఖాధికారి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

**ఎమ్మెల్యే చొరవతో నియోజకవర్గంలో వేగంగా 3500 ఇళ్ల నిర్మాణాలు**

**పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి అధికారులు చొరవ చూపాలి**

**సాంకేతిక లోపాలను సరిచేసి లబ్ధిదారులకు అండగా ఉండాలి**

**నియోజకవర్గ వ్యాప్తంగా పేదలకు చేరువవుతున్న సంక్షేమ ఫలాలు**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సాగుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామంలో నీడాల సుధాకర్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని సోమవారం ఆయన కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా పేద ప్రజల కోసం మంజూరైన 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తవుతున్నాయని, ఇప్పటికే 70 శాతం మేర ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే వెంటనే సరిచేసి లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన కోరారు. పేదలకు గూడు కల్పించే ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ గోరె బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, నాయకులు నీడాల సుధాకర్, కుంచం కుమార్, కట్ట సత్యనారాయణ, మేఘనాథం, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మే 6న మెగా జాబ్ మేళా నిర్వహణ... జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**టాప్ 100 కంపెనీల పాల్గొనడం - యువతకు విస్తృత ఉద్యోగ అవకాశాలు**

**విద్యాసంస్థల సమన్వయంతో విద్యార్థుల హాజరు పెంపు**

**మెగా జాబ్ మేళా నిర్వహణపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన జిల్లా కలెక్టర్**






**పెద్దపల్లి, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు మే 6న మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో మెగా జాబ్ మేల నిర్వహణపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 6న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. (రంగంపల్లి) ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ఉన్న వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. డీఈఈట్, టాస్క్ సమన్వయంతో సుమారు 100 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుని డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాబ్ మేళా సమాచారం ప్రతి ఒక్కరికీ చేరేలా వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాను వినియోగించాలని సూచించారు. కాలేజీల పూర్వ విద్యార్థుల వివరాలను సేకరించి, నిరుద్యోగంగా ఉన్న వారికి సమాచారం చేరేలా చూడాలని, టాస్క్ లో నమోదు చేసుకున్న యువతకు కూడా సమాచారం పంపించాలని తెలిపారు.ఈ మెగా జాబ్ మేళాను జిల్లా ఉపాధి అధికారి రాజశేఖర్ సమన్వయం చేస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ జిల్లా ఉపాధి అధికారితో సమన్వయం చేసుకుని తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.మే 6న నిర్వహించనున్న ఈ జాబ్ మేళాను పెద్దపల్లి జిల్లా పరిధిలోని నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు అందరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జడ్పి సీఈవో నరేందర్, డిఆర్డిఓ కాలిందిని, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లిచే జారీ చేయనైనది

## రైతుముంగిట 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**పెనగడపలో ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని**

**తూకంలో పారదర్శకత పాటించి రైతులకు అండగా నిలవాలి**

**మద్దతు ధర దక్కేలా అధికారులు, ఐకేపి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి**

**తేమ శాతం నెపంతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు**

**దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించవద్దు**

**కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలి**

**చెల్లింపులు సకాలంలో జరిగేలా పర్యవేక్షణ వేగవంతం చేయాలి**

**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** నియోజకవర్గానికి ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని, రైతుల కష్టాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నామని, అందుబాటులోకి వచ్చిన ఈ 22 కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. బుధవారం చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప గ్రామంలో నూతనంగా మంజూరైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. రైతుల కష్టాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కృషితో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక సంఖ్యలో కేంద్రాలను మంజూరు చేయించామని తెలిపారు. అధికారులు, ఐకేపి సిబ్బంది కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, ముఖ్యంగా తూకం విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు, తేమపేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, సరిపడ గోనె సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజ ఐకేపీ ద్వారా కొనుగోలు జరుగుతుందని, దళారుల మాయమాటలు నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని కోరారు. కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం విక్రయించిన అనంతరం రైతుల ఖాతాల్లోకి సకాలంలో నిధులు జమ అయ్యేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రైతు పక్షపాతిగా ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంపిడివో శు భాషిణి, తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ గోరె బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, నాయకులు నీడలా సుధాకర్, కుంచం కుమార్, కట్ట సత్యనారాయణ, మేఘనాథం, తాజుద్దీన్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఐఏయస్ అధికారిణి డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి గారికి ఘన వీడ్కోలు

**జిల్లా అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29 ( వార్త సంధ్య ) :** బదిలీపై వెళుతున్న ఐఏయస్ అధికారిణి శ్రీమతి డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి గారికి మంగళవారం ఐఏయస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా యంత్రాంగం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, డాక్టర్ కిరణ్మయి జిల్లాలో పనిచేసిన కాలంలో నిబద్ధత, అంకితభావంతో సేవలందించి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. మహిళా శిశు సంక్షేమం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ఆమె తీసుకున్న చొరవ జిల్లా అభివృద్ధికి దోహదపడిందన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని సత్వర పరిష్కారానికి కృషి చేయడం, పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేయడం ఆమె ప్రత్యేకత అని కలెక్టర్ పేర్కొన్నారు. యువ అధికారులకు ఆమె పనితీరు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి మాట్లాడుతూ, ఇది తనకు శిక్షణ కాలమని, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మార్గదర్శకత్వంలో అనేక అంశాలు నేర్చుకున్నానని తెలిపారు. కలెక్టర్ సలహాలు, సూచనలు, ప్రోత్సాహం తన వృత్తి అభివృద్ధికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ముఖ్యంగా బాన్సువాడ ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మదు మోహన్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని డాక్టర్ కిరణ్మయి గారిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.


## ఏజెన్సీ యువతకు ఉపాధి దిశగా 'గిరిదర్శక్' ప్రారంభం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** కొంగరకలాన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 'గిరిదర్శక్' కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలను ప్రత్యేక దృష్టి ఉన్న జిల్లాలుగా గుర్తించిన నేపథ్యంలో, గతంలో మావోయిస్టుల ప్రభావం ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. భద్రాచలం, పర్ణశాల, కిన్నెరసాని వంటి ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలు కలిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులను ఎంపిక చేసి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పర్యాటక కేంద్రాల్లో ఉద్యోగావకాశాలు కల్పించడం 'గిరిదర్శక్' కార్యక్రమం ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం తొలి విడతలో భాగంగా పదిమంది యువకులను ఎంపిక చేసి శిక్షణ అందిస్తున్నారు. భవిష్యత్తులో మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు.

## కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జనాభా గణన-2027 స్వీయ గణనను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన జిల్లా కలెక్టర్

**ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



జనాభా గణన-2027లో భాగంగా ప్రారంభమైన "స్వీయ గణన" ప్రక్రియలో జిల్లా కలెక్టర్ ప్రధాన గణన అధికారి ఆశిష్ సంగ్వాన్ గురువారం ×ణూజ కలెక్టరేట్‌లో తన కుటుంబ వివరాలను స్వయంగా పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణన-2027 పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని తెలిపారు. మొదటి దశలో భాగంగా స్వీయ గణన 26-04-2026 నుండి 10-05-2026 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

## ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాను స్వయంగా వివరాలు నమోదు చేశానని తెలిపారు.

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29( వార్తా సంధ్య ) :** ప్రతి పౌరుడు మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా https://se.census.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి సులభంగా స్వీయ గణన పూర్తి చేయవచ్చని తెలిపారు. నమోదు అనంతరం ప్రతి వ్యక్తికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూనిక్ ×ణ) వస్తుందని, దానిని భద్రపరచి ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్‌కు అందజేయాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ మే 10వ తేదీలోపు స్వీయ గణన పూర్తి చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజలు అందించే సమాచారం పూర్తి గోప్యంగా ఉంచబడుతుందని, భవిష్యత్ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనలో ఈ సమాచారం కీలకమని వివరించారు.

## పదవ తరగతి ఫలితాల్లో కామారెడ్డి జిల్లా ప్రభంజనం

**97.47% ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే ముందంజ**

**191 పాఠశాలల్లో 100% ఫలితాలు: కలెక్టర్ మార్గదర్శకత్వమే కారణం**

**గతేడాది కంటే 2.82% ఉత్తీర్ణత పెరుగుదల**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29 ( వార్త సంధ్య) :** కామారెడ్డి: మార్చి-2026లో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో కామారెడ్డి జిల్లా 97.47% ఉత్తీర్ణతతో అద్భుత ఫలితాలు సాధించింది. గౌరవ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచనలు, సలహాలు, నిరంతర మార్గదర్శకత్వంతో జిల్లాలోని 191 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అంకితభావంతో చేసిన కృషి, విద్యార్థుల క్రమశిక్షణ ఫలితంగా గతేడాదితో పోలిస్తే 2.82% ఉత్తీర్ణత శాతం పెరిగింది.

**జిల్లా స్థాయి టాపర్స్:**

ఎస్.పి.ఆర్ పాఠశాల విద్యార్థులు డి. సుహృత్ 590 మార్కులతో ప్రథమ స్థానం, పి. క్యూరీ 589 మార్కులతో ద్వితీయ స్థానం, బి. శ్రీ మహర్షి 587 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. లిటిల్ స్కాలర్స్ పాఠశాల విద్యార్థిని ఎం. సుదీక్ష 587 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.

**ప్రభుత్వ పాఠశాలల టాపర్స్:**

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దోమకొండ విద్యార్థిని ప్రణవి 582 మార్కులతో ప్రథమ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంగంపల్లి విద్యార్థిని ఎం. సౌందర్య 580 మార్కులతో ద్వితీయ స్థానం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దోమకొండ విద్యార్థిని ఎన్. భవాని 578 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ "విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఘనత సాధ్యమైంది. 100% ఫలితాలు సాధించిన పాఠశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, మెరిట్ విద్యార్థులకు నా అభినందనలు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాల కోసం ఇప్పటినుంచే ప్రణాళికతో ముందుకు వెళ్దాం" అని పిలుపునిచ్చారు.ఉత్తమ ఫలితాలు సాధించినందుకు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ రాజు ను, ఇతర విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు

## 2026 ఎస్ఎస్‌సి ఫలితాల్లో శ్రీ రాగా స్కూల్ ప్రభంజనం




**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** బుధవారం నాడు విడుదలైన 2026 ఎస్ ఎస్ సి పరీక్షా ఫలితాలలో శ్రీ రాగా స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విశేష విజయాన్ని సాధించారనీ యాజమాన్యం మల్లారపు వర ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థుల బి.అఖిల్ 560, రిషిత్ రాణా 532, టీ.హేమంత్ నాయక్ 519, డి.శ్రీ చైతన్య -- 505, యెస్.కె ఆజ్మిల్ -- 500 మార్కులు సాధించారు. బోర్డు పరీక్షకు అటెండ్ అయిన వారు 30 మంది.పాస్ అయిన వారు 30 మంది. 100 ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల డైరెక్టర్ ఎం. కవిత తమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు శ్రీ రాగా స్కూల్ యొక్క నాణ్యమైన విద్యా ప్రమాణాలను, కృషిని ప్రతిబింబిస్తున్నాయి. టాప్ స్కోర్లు సాధించి పాఠశాల కీర్తి పతాకాన్ని ఎగురవేసిన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు. ఈ విజయానికి తోడ్పడిన శ్రీ రాగా టీచింగ్ మరియు నాన్-టీచింగ్ సిబ్బందికి, అలాగే తమ పిల్లల విద్యాభివృద్ధికి నిరంతరం సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ.. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ యాజమాన్యం అభినందనలు తెలిపారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# మంథని లోని ప్రణం డే కేర్ సెంటర్ ని సందర్శించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, మంథని, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** మంథని పట్టణంలోని ప్రణం డే కేర్ సెంటర్ ని జిల్లా కలెక్టర్ కోయ హర్ష బుధవారం సందర్శించి వయోవృద్ధులు పొందుతున్న సేవల గుర్చి వయోవృద్ధులను అడిగి తెలుసుకున్నారు.తాము ఇందులో పొందుతున్న సేవలు గురించి కలెక్టర్ కి వివరించినారు. కలెక్టర్ సంతృప్తి చెంది త్వరలో మధ్యాహ్నం వీరికి ఇచ్చే అల్పాహారం బదులు భోజన సదుపాయం మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఏర్పాటు చేస్తామన్నారు. ఈరోజు 46వ వివాహ వార్షికోత్సవం వేడుకలు జరుపుకుంటున్న రామడుగు పద్మావతి మారుతి రావు ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను రామడుగు పద్మావతి మారుతీ రావు శాలువాతో సన్మానించారు. రామడుగు పద్మావతి మారుతి రావు వయోవృద్ధులకు పండ్లు స్వీట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమ వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మేడ గోని రాజమౌళి గౌడ్, గౌరవాధ్యక్షులు నిర్వాహకులు పీటి స్వామి,కోశాధికారి కొమురవెల్లి సత్యనారాయణ, కమిటీ సభ్యులు కనుకుంట్ల స్వామి,మాదాడి నరేందర్ రెడ్డి,కాజా మైనుద్దీన్,పోరెడ్డి వెంకటరెడ్డి అధిక సంఖ్యలో వయోవృద్ధులు పాల్గొన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులకు మరియు వారి బంధువులకు నిరంతరంసేవలు అందిస్తున్న మాదాడి నరేందర్ రెడ్డి ని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

# నాగోల్ డివిజన్ లో పర్యటించిన ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి





**ఎల్బీనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 29 (వార్త సంధ్య):** నాగోల్ డివిజన్ పరిధిలోని రామాంజనేయ కాలనీవాసుల అభ్యర్ధన మేరకు ఈ రోజు ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.ఇటీవల శాసనసభ్యులు సుధీర్ రెడ్డి చొరవ వల్ల దాదాపు 66 లక్షల రూపాయల వ్యయంతో డ్రైనేజీ పనులు మంజూరు చేసి పూర్తి చేయించడంతో సమస్యలు తగ్గినట్లు కృతజ్ఞతలు తెలిపారు.అయితే ఇంకా సుమారు 70 మీటర్ల మేర డ్రైనేజీ లైన్ పనులు మిగిలి ఉన్నాయని వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.అదేవిధంగా కాలనీలో మంచినీటి సదుపాయం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ,కొన్ని గల్లీలలో కొత్తగా వాటర్ లైన్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం కాలనీలో సి.సి.రోడ్ల నిర్మాణం చేపట్టాలని కూడా ప్రజలు కోరారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు సుధీర్ రెడ్డి స్పందిస్తూ కాలనీవాసుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి మిగిలిన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.దానికి కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెర్కు సంగీత ప్రశాంత్ గౌడ్,సీనియర్ బారాస నాయకులు అనంతుల రాజిరెడ్డి,డివిజన్ అధ్యక్షులు చిరంజీవి,సతీష్ యాదవ్,శిల్పారెడ్డి, సీతారాములు, రమేష్,పోచంపల్లి రాజేందర్ రెడ్డి మరియు కాలనీవాసులు సత్తిరెడ్డి,వెంకట రాములు,రవి, రాంచందర్,ప్రేమ్ కుమార్,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో కాకతీయ ప్రభంజనం




**పెద్దపల్లి, మంథని, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** పదవ తరగతి ఫలితాల్లో కాకతీయ ప్రభంజనం సృష్టించింది. తెలంగాణ ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో మంథని పట్టణానికి చెందిన కాకతీయ ఉన్నత పాఠశాల ఏకంగా 29 మందికి 500 మార్కులు సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించింది. కాకతీయ పాఠశాలకు చెందిన విద్యార్థిని దుద్దిల్ల ఆరాధ్య 600 మార్కులకు 577, వినీత 576, హర్ష శ్రీ 572, గాయత్రి 572, శ్రీనిధి 562, అలేఖ్య 555, సాయి చందు 555, ధనశ్రీ 553, ధనుష్ చంద్ర 553 మార్కులు సాధించారు. 550 పైగా 9 మంది విద్యార్థులు సాధించడం విశేషం. వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి ఘనంగా శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన అద్భుత విజయానికి విద్యార్థులకు కృషి, ఉపాధ్యాయుల అంకిత భావం, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణాలుగా నిలిచాయని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కాకతీయ పాఠశాల నుండి అత్యుత్తమ మార్కులు సాధించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నట్లు ఆయన ఆశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు,పాఠశాల సిబ్బంది,తల్లిదండ్రులు పాల్గొన్నారు

# చీకటిమామిడి గ్రామానికి గర్వకారణంగా నిలిచిన విజ్ఞకు ఘన అభినందనలు



**మునుగోడు: ఏప్రిల్ -29(వార్త సంధ్య):** మునుగోడు మండలంలో అత్యధిక మార్కులు సాధించి అద్భుత ప్రతిభను కనబరిచిన చీకటిమామిడి గ్రామ ముద్దుబిడ్డ, ఏరుకొండ అంజయ్య అన్న మనవరాలు,రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ,చండూర్ ఇంచార్జ్ ఎంపిఓ కోటయ్య కుమార్తె విజ్ఞ సాధించిన విజయం గ్రామానికి ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చింది.తన అచంచలమైన పట్టుదల,క్రమశిక్షణ, నిరంతర శ్రమతో విద్యలో ఉన్నత ఫలితాలు సాధించి మండల స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందడం నిజంగా అభినందనీయమైన విషయం.విజ్ఞ సాధించిన ఈ ఘన విజయం కేవలం వారి కుటుంబానికే కాకుండా,మన చీకటిమామిడి గ్రామం మొత్తానికి గర్వకారణంగా నిలిచింది.గ్రామం పేరును మండల స్థాయిలో నిలబెట్టి, భావితరాలకు ఆదర్శంగా నిలిచిన విజ్ఞను చూసి గ్రామ ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఎలాంటి ఉన్నత స్థాయినైనా చేరుకోవచ్చని విజ్ఞ మరోసారి నిరూపించింది.ఈ సందర్భంగా చీకటిమామిడి గ్రామ ప్రజలందరి తరపున విజ్ఞకు ప్రత్యేక అభినందనలు, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ,భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, గ్రామానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాము.మన గ్రామ ముద్దుబిడ్డ విజ్ఞకు హృదయపూర్వక కంగ్రాచులేషన్స్ నీ విజయయాత్ర ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

# అశేష జనావాహిని మధ్య "మంత్రపురి విరాజ్ హిందూ సమ్మేళనం"






**పెద్దపల్లి, మంథని, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** మంథని పట్టణంలోని కాలేజీ గ్రౌండ్‌లో బుధవారం "మంత్రపురి విరాట్ హిందూ సమ్మేళనం" అశేష జనవాహిని మధ్య అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా హిందువులను ఏకం చేయాలనే ఏకైక లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హిందూ బంధువులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఈ సమ్మేళనంలో ప్రధాన వక్తగా విచ్చేసిన సామల కిరణ్ మాట్లాడుతూ.. వంద ఏళ్ల సంఘ ప్రయాణం దేశానికి ఒక దిక్సూచి అని, హిందూ సమాజం ఐక్యంగా ఉండాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉందని పేర్కొన్నారు. మహిళా వక్త ఠాగూర్ తారభాయ్ ధర్మ పరిరక్షణలో మాతృమూర్తుల పాత్రను కొనియాడగా, శ్రీ రామదాసి సురేష్ ఆత్మారాం మహారాజ్ ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, సమ్మేళనం అధ్యక్షులు కర్నె హరిబాబు,కార్యదర్శి నల్మాస్ ప్రభాకర్, ఉపాధ్యక్షులు కోరవేని రాజ్ కుమార్,వేదికపై ప్రసంగిస్తూ హిందూ ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ చారిత్రాత్మక ఘట్టంలో సమితి సభ్యులు గర్రెపెల్లి వెంకటేశ్వర్లు, కొత్త శ్రీనివాస్, కనుకుంట్ల స్వామి,తూర్పాటి రాము, తోంద్ల సంతోష్, బొడ్డు సతీష్,మాడిశెట్టి సుదర్శన్, కొమురవెల్లి హరీష్, మాడిశెట్టి సురేందర్, చొప్పర రమేష్, కొండ తిరుపతి,రోడ్డ రాజేశ్వర్ రావు,దువ్వ తిరుపతయ్యలతో పాటు పెద్ద సంఖ్యలో యువకులు చురుగ్గా పాల్గొన్నారు. జై శ్రీరామ్ నినాదాలతో మంత్రపురి ప్రాంతం మార్మోగగా,ఈ సమ్మేళనం హిందూ సమాజంలో సరికొత్త చైతన్యాన్ని నింపింది.

# మంథని వ్యాపార అభివృద్ధి కోసమే రోడ్డు నిర్మాణం

**ప్రతిపక్ష పార్టీవి నిరాధార విమర్శలు రైతులను ముంచిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే**

**మంథనిలో విలేకరులతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్**



**పెద్దపల్లి, మంథని, ఏప్రిల్ 29( వార్త సంధ్య) :** మంథని పట్టణాన్ని వ్యాపార కేంద్రంగా మార్చే లక్ష్యంతోనే ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులను చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్ స్పష్టం చేశారు. బుధవారం మంథని గోదావరి నది ఒడ్డున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగు పడటమే కాకుండా, పట్టణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు.రైతుల రక్తం తాగింది మీ బీఆర్ఎస్ ప్రభుత్వం అని రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన గుర్తు చేశారు.గత ప్రభుత్వ తీరుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రైతులను నిలువునా ముంచిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వంది అని తక్కువ పరిహారం ఇచ్చి, అర్ధరాత్రి వేళ మెగా కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్లు చేయించి రైతుల కడుపు కొట్టారని ఆయన విమర్శించారు. దానికి భిన్నంగా,ప్రస్తుత ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇస్తున్న రైతులకు మార్కెట్ విలువ కంటే ఎనిమిది నుండి పది రెట్లు ఎక్కువ పరిహారం చెల్లిస్తోందన్నారు. గోదావరి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి అలాగే నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పూర్తయితే మంథని పట్టణం వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఒకరి లాభం అందరి ప్రగతి అంటూ నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలి అన్నారు. రోడ్డు నిర్మాణం వల్ల ఒకరు లాభపడితే మరొకరికి నష్టం జరుగుతుందనే దుష్ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. అభివృద్ధి అనేది అందరి కోసం జరుగుతోందని, మొత్తం పట్టణ ప్రగతిని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ఆయన తెలిపారు.నిరాధార విమర్శలు చేస్తే ఊరుకోము సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలకు గట్టి హెచ్చరిక చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రతిపక్షం ఇచ్చే ఏ మంచి సూచననైనా ప్రభుత్వం స్వాగతిస్తుందని అదే పనిగా నిరాధార విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే తిరిగి మళ్ళీ ప్రజా ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని తెలుసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. మంథని పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రగతి చక్రం ఆగదని ఆయన పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మూల పురుషోత్తం రెడ్డి, బెజ్జంకి డిగంబర్, పేరవేన లింగయ్య యాదవ్, పాపారావు,ఐలి శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్,మంథని రాకేష్, పెంటరీ రాజు, కాశిపేట బాపూ,ఊదరి ఓదెలు, ఉట్ల అనిల్ రెడ్డి దొనగోర్ల శ్రీనివాస్, గోవిందుల రమేష్, ఇందారపు అనిల్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరి వృత్తిదారుల హక్కుల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ - మే 17న 33 జిల్లాల సర్వసభ్య సమావేశం





**హైదరాబాద్ :ఏప్రిల్- 29(వార్త సంధ్య):** హైదరాబాద్‌లోని ఆర్ట్స్ కాలేజ్,ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు నాయకత్వంలో రాష్ట్ర స్థాయి ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహించబడింది.ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్,రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టీకే శ్రీనివాస్ నాయకత్వంలో రాష్ట్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ మాట్లాడుతూ కుమ్మరి వృత్తిదారులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మట్టి పాత్రల వినియోగం పెరగడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని,ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో మట్టి పాత్రలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.అంతేకాకుండా కుమ్మరి వృత్తిదారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక కుమ్మరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మట్టి పాత్రల తయారీకి ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం మాట్లాడుతూ, కుమ్మరి వృత్తిదారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం వద్ద సమగ్ర నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర స్థాయి బహిరంగ సభ నిర్వహించి, కుమ్మరి వృత్తిదారుల సమస్యలను మరింత బలంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే కార్యాచరణ చేపడతామని వెల్లడించారు.రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కల్పించే నామినేటెడ్ పోస్టుల్లో కుమ్మరి కులానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, సామాజిక న్యాయం పరిరక్షించేలా అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు టీకే శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి తమకు రావలసిన వాటా, హక్కులు, సంక్షేమ పథకాలు కచ్చితంగా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా 2026 మే 17న ఉస్మానియా యూనివర్సిటీ ఫాకల్టీ క్లబ్‌లో 33 జిల్లాల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ సమావేశంలో కుమ్మరి వృత్తిదారుల అభివృద్ధి, హక్కుల సాధన, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు నాయకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామనుకోలు వీరేశం, రాష్ట్ర కార్యదర్శి నాగపురి నగేష్, సహాయ కార్యదర్శి కొత్తపల్లి జయసింహా, రాజకీయ విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాచకొండ కృష్ణయ్య, యువత విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఏరుకొండ శ్రీనివాస్, వృత్తిదారుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు గుండాల గోవర్ధన్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఖమ్మంపాటి సత్యనారాయణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు ఎగిరిశెట్టి వీరన్న, నిమ్మలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.కుమ్మరి వృత్తి పరిరక్షణ,పర్యావరణ సంరక్షణ, సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.


# కిశోర బాలికల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం




**మునుగోడు,: ఏప్రిల్- 29(వార్త సంధ్య):** మునుగోడు మండలంలో చీకటిమామిడి గ్రామశీలో ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో కిశోర బాలికల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. బాలికల శారీరక, మానసిక, సామాజిక మరియు భావోద్వేగ వికాసానికి తోడ్పడే విధంగా రూపొందించిన ఈ కార్యక్రమం గ్రామీణ స్థాయిలో విశేష స్పందన పొందుతోంది. ముఖ్యంగా యుక్తవయస్సులో బాలికలు ఎదుర్కొనే అనేక సవాళ్లను అధిగమించేలా వారికి సరైన దిశానిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా బాలికల ఆరోగ్య సంరక్షణ, పోషకాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, విద్య పట్ల ఆసక్తి పెంపొందించడం, స్వీయ రక్షణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సమాజంలో తమ హక్కులపై అవగాహన వంటి కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. అదేవిధంగా బాల్యవివాహాల నివారణ, చిన్న వయస్సులో గర్భధారణ వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, సురక్షితమైన భవిష్యత్ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై నిపుణులు బాలికలకు విపులంగా వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు, ప్రతి బాలిక తనలోని ప్రతిభను గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, విద్యను ఆయుధంగా మలుచుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. బాలికలలో సానుకూల దృక్పథం, స్వయం నిర్ణయ సామర్థ్యం, సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించాలనే సంకల్పం పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.అలాగే తల్లిదండ్రులు, ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం గోసుకొండ భాస్కర్, అంగన్వాడి సూపర్వైజర్ శివేష,కో ఆప్షన్ సభ్యులు, ఏరుకొండ శ్రీరాములు,వార్డ్ నెంబర్లు చింతల లోకేష్, బోయపల్లి కృష్ణయ్య, ఏరుకొండ భాగ్యలక్ష్మి నగేష్, పాంపాటి విజయకుమార్ , అంగన్వాడి టీచర్లు పాలకూరి విజయ, జీడిమడ్ల శోభ, వివో ఏలు మేకల సునీత, రామసాయం లలిత, సంఘ బంధాల ఓబి కమిటీ జీడిమడ్ల అశ్విని, పల్లె రమణ,సంఘ బంధం -2 కార్యదర్శి చెన్నగోని ఉమా,గ్రామపంచాయతీ సిబ్బంది మహిళా సంఘం సభ్యురాలు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు భాగస్వామ్యం కావడం ద్వారా బాలికలకు మరింత బలమైన ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి బాలికల అభివృద్ధికి తోడ్పడినప్పుడే ఆరోగ్యవంతమైన, విద్యావంతమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన భావితరాన్ని నిర్మించగలమని తెలిపారు.ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమం ద్వారా కిశోర బాలికలు తమ సామర్థ్యాలను వెలికితీసుకుని, అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ పురోగతికి భాగస్వాములు కావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# పదవ తరగతి ఫలితాలలో బాలికల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రభంజనం




**పెద్దపల్లి, మంథని, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** మంథని మున్సిపల్ పరిధిలోని కూచ్రాత్ పల్లి తెలంగాణ గురుకుల బాలికల మైనారిటీ పాఠశాలలో పదవ తరగతి ఫలితాలల్లో ప్రభంజనం సృష్టించింది. బుధవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో సహస్రిక 600 మార్కులకు 569 మార్కులు, దీప్తి 600 మార్కులకు 566 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిలను ప్రిన్సిపాల్, టీచర్ లు అభినందించారు.

# మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం

**నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా అక్రిడిటేషన్ జారీ చేయాలి**



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 29 (వార్త సంధ్య) :** నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, జీఓ 252కు అనుగుణంగా అన్ని నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని, అన్ని విషయాలు పరస్పరం చర్చించుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.ఈ సమావేశంలో డీపీఆర్‌ఓ బాలేశ్వరి, కమిటీ సభ్యులు కె. శ్రీకాంత్ రెడ్డి, శేఖర్ ఉప్పరి, సయ్యద్ ఇక్రముల్లా హుస్సైని, అన్నవరపు శేఖర్ బాబు, మహ్మద్ సిరాజ్, గంజి ప్రదీప్ కుమార్, సిహెచ్. రాంరెడ్డి, ఏం. శ్రీనివాస్, యు. శివ కుమార్, రొయ్యల రాజు, ఏఈఐఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా జేఏసీ చైర్మన్‌గా డా. కే. రామారావు ఏకగ్రీవం

**మే 5 నిరాహార దీక్షకు సన్నాహక సమావేశం**




**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 28 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రంగారెడ్డి జిల్లా ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ (౧+జుజీూజ) మే 5న కలెక్టరేట్ కొంగరకలాన్‌లో నిర్వహించనున్న ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమానికి సన్నాహక సమావేశం నాంపల్లి టీజీవో భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మే 5న జరగబోయే నిరాహార దీక్ష కార్యక్రమానికి నాయకత్వ బాధ్యతలను టీజీఓ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డా. కే. రామారావుకు అప్పగిస్తూ, ఆయనను జేఏసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 15.25 లక్షల ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పీఆర్‌సీ అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఈహెచ్ఎస్ సమస్యల పరిష్కారం, సీపీఎస్ రద్దు వంటి నాలుగు ప్రధాన డిమాండ్లతో పాటు మరో 64 పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో టీఎన్జీఓ నాయకులు యశ్వంత్, శ్రీనివాస్, గోపాల్ నాయక్, రంగయ్య, పీఆర్‌టీయూ ప్రతినిధులు మహేందర్ రెడ్డి, ఎస్టీయూ నాయకుడు ప్రవీణ్ కుమార్, టీజీఓ నాయకులు శ్రీనేష్ కుమార్ నోరి, నూతన కంటి వెంకట్, టీఆర్‌టీఎఫ్ ప్రతినిధి ఎం. రమేష్, జీటీఏ నాయకుడు నరసింహ, టీజీఓ మహిళా నాయకులు రేవతి, శాంతిశ్రీ, అనిత, మహేశ్వరి, రాకేష్, మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనుల పేరుతో ప్రజా ఆస్తుల ధ్వంసం... బాధ్యత ఎవరిది?

**జెసిబితో తవ్వి వదిలేసిన సిమెంట్ రోడ్డు పనులు**

**డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నా పట్టించుకోని కాంట్రాక్టర్**

**"రోడ్డు వేయడమే మా పని" అంటూ బాధ్యత తప్పించుకునే ప్రయత్నం**

**ఇంజనీర్ స్పందన లేకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం**

**బిజెపి కార్పొరేట్ కార్యాలయం ముందే నిర్లక్ష్యం వెలుగులోకి**







**ఎల్బీనగర్ ప్రతినిధి, వార్త సంధ్య:** ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని గడ్డిఅన్నారం డివిజన్‌లో ఉన్న వివేకానంద నగర్ కాలనీలో రోడ్డు పనులు ప్రజలకు ఉపశమనం ఇవ్వాల్సింది పోయి ఇబ్బందులకు దారితీస్తున్నాయి. సిమెంట్ రోడ్డు మరమ్మత్తుల పేరుతో జెసిబి యంత్రాలతో పాత రోడ్లను తొలగించిన కాంట్రాక్టర్, పనులను పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేయడం స్థానికుల ఆగ్రహానికి కారణమైంది. ముఖ్యంగా రోడ్డు తొలగింపు సమయంలో పక్కనే ఉన్న డ్రైనేజీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నా, దాని పట్ల ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.ఈ విషయంపై స్థానికులు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా, "రోడ్డు తొలగించడం, కొత్త రోడ్డు వేయడం వరకే మా బాధ్యత.

ఆ సమయంలో ఏదైనా పబ్లిక్ ప్రాపర్టీ డ్యామేజ్ అయితే అది మా పరిధిలోకి రాదు. ఇంజనీర్ ఆదేశిస్తే మాత్రమే మరమ్మతులు చేస్తాం" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యాఖ్యలు ప్రజలలో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తున్నాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ మొత్తం వ్యవహారం బిజెపి కార్పొరేట్ కార్యాలయం సమీపంలోనే జరుగుతుండటం. ప్రజా ప్రతినిధుల కార్యాలయాల ముందే ఇలాంటి నిర్లక్ష్యం కనిపిస్తుండటం అధికార వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత ఇంజనీర్ నుంచి సరైన స్పందన రాకపోవడం మరింత అసంతృప్తికి దారితీస్తోంది. ప్రజా ఆస్తులైన డ్రైనేజీ వ్యవస్థలు ధ్వంసమవుతున్నప్పటికీ, కాంట్రాక్టర్ మరియు అధికారులు బాధ్యత తీసుకోకుండా పరస్పరం నెట్టుకొస్తున్న తీరు ప్రజలకు నష్టాన్ని కలిగిస్తోంది. ప్రజల సౌకర్యాల కోసం చేపట్టిన అభివృద్ధి పనులు, సరైన పర్యవేక్షణ లేకపోతే ఎలా సమస్యలుగా మారతాయో ఈ సంఘటన స్పష్టంగా చూపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పెట్రోల్.. డీజిల్ ధరల పెంపులేదన్న కేంద్రం.. నమ్మొచ్చా? గతంలో ఏం జరిగింది?

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతాయి- ఏనలుగురు కలిసిని ఇదే మాట వినిపిస్తోంది. గురూ.. బుధవారం సాయంత్రం ఏ క్షణమైనా పెట్రోల్ రేట్లు పెరుగుతాయంటగా- ఏ ఇద్దరు మిత్రులు కలిసినా.. ఇదే మాట. మొత్తంగా.. దేశంలో పెట్రోలు, డీజిల్ ధరల పెంపుపై సర్వత్రా చర్చ సాగుతోంది. దీనికి ప్రధాన కారణం.. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు కొనసాగుతుండడం.. ముఖ్యంగా ఇంధన సరఫరాకు హోర్ముజ్ జలసంధిలో ఏర్పడిన ఇబ్బందులు.. తద్వారా దేశంపై పడుతున్న ప్రభావం. ఫలితంగా పలు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ కోసం ముందస్తు కొనుగోళ్లు కూడాపెరిగాయి. ఇంకోవైపు.. బంకుల యజమానులు కూడా ఈ విషయంలో దోబూచులాడుతున్నారన్న చర్చ ఉంది. బుధవారం సాయంత్రంతో పశ్చిమ బెంగాల్‌లోని 142 నియోజ కవర్గాల పోలింగ్ పూర్తికానుంది. దీంతో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ కూడా ముగియనుంది. ఇక, ఇప్పట్లో ఎలాంటి ఎన్నికలు లేవు. ఈ పరిణామాల క్రమంలోనే దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచేందుకు కేంద్రం సమాయత్తమైందన్న చర్చ జోరుగా తెరమీదికి వచ్చింది. దీనికి మరో కారణం.. అధిక ధరలకు కేంద్రం కూడా ఇంధనాన్ని కొనుగోలు చేయడమే. ఈ క్రమంలో దేశంలో ఒక ప్యానిక్ సిట్యుయేషన్ అయితే నెలకొంది. దీనిపై కేంద్రం తాజాగా వివరణ ఇచ్చింది. పెట్రోలు, డీజిల్ ధరలను పెంచే ఉద్దేశం కానీ.. ఆ తరహా ప్రతిపాదన కాదనీ పేర్కొంది. కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి.. తాజాగా మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న ప్యానిక్ తమకు కూడా తెలిసిందని.. అయితే, ఎలాంటి పెంపు ఉండదని ఆ ప్రతిపాదన కూడా లేదని వ్యాఖ్యానించారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ నిల్వలు.. సమృద్ధిగా ఉన్నాయన్నారు. --ఇప్పటి వరకు ధరల



పెంపుపైఎలాంటి ప్రతిపాదనా కేంద్రం వద్ద లేదు. అయితే..ఈ వ్యవహారాన్ని నమ్మే విషయంలో గత అనుభవాలను పరిశీలిస్తే.. అనేక అనుమానాలు తెరమీదికి వస్తున్నాయి. గత ఏడాది జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కేంద్రం పెట్రోల్ ధరలను పెంచేది లేదని తెలిపింది. కానీ, ఎన్నికలు ముగిసిన రెండు గంటల్లోనే లీటరుకు రూ.2 చొప్పున పెంచారు. అదేవిధంగా కర్ణాటక ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఇలానే పెంచారు. దీంతో ధరల పెంపు విషయంపై అప్పటికప్పుడు నిర్ణయం తీసుకునే అవకాశం కూడా ఉంటుంది. పైగా.. పెట్రోలియం శాఖ కార్యదర్శి చేసిన వ్యాఖ్యల్లోనే సందిగ్ధత ఉంది. --ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదన లేదు-- అన్నారు. అంటే.. ఎన్నికలు ముగిసిన తర్వాత.. ఉండదని చెప్పలేదు. సో.. మొత్తానికి ఇదొక సందిగ్ధమైన పరిస్థితి.

# హైదరాబాదులో పాస్ పోర్ట్ మెగా మేళా... ఎప్పుడంటే...!

**పాస్‌పోర్ట్ దరఖాస్తుదారుల కోసం మే 9న ప్రత్యేక మేళా**

**హైదరాబాద్ రీజియన్‌లో 4,000 అదనపు స్లాట్ల విడుదల**

**8-10 రోజుల నిరీక్షణ సమయాన్ని తగ్గించడమే లక్ష్యం**

**మే 4 నుంచి కరీంనగర్ పీఎస్‌కే సామర్థ్యం పెంపు**



పాస్‌పోర్ట్ దరఖాస్తు దారులకు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయం (ఆర్పీవో) శుభవార్త చెప్పింది. వేసవిలో పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని, అపాయింట్‌మెంట్ల కోసం నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు మే 9న ప్రత్యేకంగా "పాస్‌పోర్ట్ మేళా" నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేళాలో భాగంగా నార్మల్ కేటగిరీ కింద 4,000 అదనపు అపాయింట్‌మెంట్ స్లాట్లను విడుదల చేస్తున్నట్లు హైదరాబాద్ ఆర్పీవో జె. స్నేహజ తెలిపారు. హైదరాబాద్ పరిధిలోని బేగంపేట, ఎంజీబీఎస్ మెట్రో, రాయదుర్గం పీఎస్‌కేలకు 3,100 స్లాట్లు, కరీంనగర్, నిజామాబాద్ పీఎస్‌కేలకు 900 స్లాట్లు కేటాయించారు. ఈ అదనపు స్లాట్లు తత్కాల్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్ (పీసీసీ) సేవలకు వర్తించవని స్పష్టం చేశారు. ప్రస్తుతం 8 నుంచి 10 రోజులుగా ఉన్న అపాయింట్‌మెంట్ నిరీక్షణ కాలాన్ని 5 నుంచి 7 రోజులకు తగ్గించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని స్నేహజ వివరించారు. సేవల సామర్థ్యాన్ని పెంచడంలో భాగంగా, మే 4 నుంచి కరీంనగర్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పీఎస్‌కే) రోజువారీ అపాయింట్‌మెంట్ల సామర్థ్యాన్ని 220 నుంచి 400కి పెంచుతున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తుదారులు అధికారిక వెబ్‌సైట్ జూఖంంజూశీతీఱఅఎఱు.స్త్రశీజ.ఱఅ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్లను బుక్ చేసుకోవాలని సూచించారు.

# రెండేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు మోక్షం: మంత్రి నిమ్మల



ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 11 కీలక సాగునీటి ప్రాజెక్టులను రానున్న రెండేళ్లలో పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. ఇందుకోసం రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి నిన్న అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి ఈ వివరాలు తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఉత్తరాంధ్రలో కొత్తగా 2.69 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుండగా, మరో 2.49 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని వివరించారు. కరవు పీడిత ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూరే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషితో వంశధార ట్రైబ్యునల్-2021 తీర్పు గెజిట్‌లో ప్రచురితమైందని మంత్రి తెలిపారు. "కేంద్ర మంత్రులు, జలశక్తి అధికారులతో సీఎం తరచూ సంప్రదింపులు జరిపి ఇది సాధించారు. ఫలితంగా శ్రీకాకుళం జిల్లాలో నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి" అని నిమ్మల పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేలా పనిచేస్తామని స్పష్టం చేశారు.

# ఏపీలో వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే రెడీ.. !

ఎన్నికలకు రెండున్నర సంవత్సరాలకు పైగా సమయం ఉంది. పైగా వారంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలే. అయినప్పటికీ వచ్చే ఎన్నికలపై ఇప్పటి నుంచే కొందరు ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో తమ సొంత ప్రాంతాలను కాదని వేరే ప్రాంతాలకు వెళ్లి వేరే నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేశారు. దీంతో ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో.. వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ చేస్తే తమ పరిస్థితి ఏమిటి అన్నది కొంతమంది ఎమ్మెల్యేలకు దిగులు పట్టుకుంది. ఇది వాస్తవం కూడా. గత ఎన్నికల్లో అంటే కూటమి ప్రభావం ఉంది. వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత కూడా ఉంది. కాబట్టి ఎవరు పోటీ చేశారు.. ఎవరు నిలబడ్డారు.. అన్నది కూడా కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు గమనించలేదు. కేవలం పార్టీ గుర్తులు, పార్టీ అధినేతలను చూసి వారు ఓటేశారు. కానీ వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి రిపీట్ అవుతుందా అంటే కష్టం. ఎందుకంటే ఐదు సంవత్సరాల పరిపాలన కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఎంతో కొంత వ్యతిరేకత ఏ ప్రభుత్వం పైన అయినా ఉంటుంది. దీనికి చంద్రబాబు మాత్రం అతీతులు కారు. ఘాశ్రీంశీ =ఘుఎ - అమరావతికి కేంద్రం మరో వరం.. పనులు చకచకా! ఘాఎజవతీఅంవఎవత్ గత 2019 ఎన్నికల్లో ఓడిపోయిన విషయం గుర్తుండే ఉంటుంది కదా. ఈ నేపథ్యంలో ఇప్పుడు చాలామంది ఎమ్మెల్యేలు తమ తమ సొంత నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఒకవైపు పనులు చేస్తూనే.. ఎందుకైనా మంచిది అని తమ సొంత నియోజకవర్గాలపై ఒక అడుగు వేశారు. ఇటువంటి వారిలో మాజీ మంత్రులు ఉన్నారు. సీనియర్ నాయకులు కూడా ఉన్నారు. వీరంతా తరచుగా తమ తమ సొంత నియోజకవర్గంలో పర్యటించడంతోపాటు అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా తమ అనుచరుల ద్వారా తెలుసుకుంటున్నారు. అంతేకాదు స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను వీరు నిరంతరం తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు.



తద్వారా వచ్చే ఎన్నికల్లో తమ సొంత నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందన్న విషయాన్ని ఇప్పటినుంచి లెక్కలు కట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ జాబితాలో మాజీ మంత్రి ప్రస్తుతం ఎమ్మెల్యే కళా వెంకట్రావుతో పాటు సీనియర్ నాయకులు, జూనియర్ ఎమ్మెల్యేలు ఇలా అనేకమంది ఉన్నారు. వీరందరి లక్ష్యం.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించటం. అయితే తమది కానీ నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేస్తే వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది తమకు మైనస్ గా మారుతుందని భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు తమ తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేసి మరోసారి గెలుపు గుర్రం ఎక్కి దిశగా ఆలోచన చేస్తున్నారు. అప్పుడు ఎంత వ్యతిరేక ప్రభావం ఉన్నప్పటికీ.. సొంత నియోజకవర్గంలో సొంత అనుచరులు సొంత సామాజిక వర్గం తమకు సానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. మరి దీనికి ఎటువంటి పరిస్థితులు వస్తాయి.. పార్టీ అధినేత చంద్రబాబు ఏ విధంగా నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి.

# అధిక వడ్డీ ఆశ చూపి రూ.6.5 కోట్ల మోసం..

# వనస్థలిపురంలో మహిళ అరెస్ట్

**హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, చిట్టీల పేరుతో భారీ మోసం**

**అధిక వడ్డీ ఆశ చూపి సుమారు రూ.6.5 కోట్ల వసూలు**

**బడ్డం జ్యోతి అనే మహిళను అరెస్ట్ చేసిన వనస్థలిపురం పోలీసులు**

**విచారణలో నేరం ఒప్పుకున్న నిందితురాలు**



రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, చిట్టీల పేరుతో అధిక వడ్డీ ఆశ చూపి సుమారు రూ.6.5 కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడిన మహిళను హైదరాబాద్ వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. వనస్థలిపురం సీఐ ఎస్. రవిబాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడకు చెందిన బడ్డం జ్యోతి (48), గత 9 ఏళ్లుగా వనస్థలిపురం కమలానగర్‌లో నివాసం ఉంటోంది. జ్యోతి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని నమ్మించి, పెట్టుబడులపై 10 శాతం వరకు వడ్డీ ఇస్తానని పలువురిని ఆకర్షించింది. దీనితో పాటు పరిచయస్తులతో చిట్టీలు కూడా నడిపించింది. మొదట్లో చెప్పినట్లుగానే లాభాలు, వడ్డీలు చెల్లించడంతో ఆమెను అందరూ నమ్మారు. ఇదే అదనుగా 2020 నుంచి వనస్థలిపురం పరిధిలో సుమారు 10 మంది బాధితుల నుంచి రూ.6.5 కోట్లకు పైగా వసూలు చేసింది. ఆ తర్వాత డబ్బులు తిరిగి ఇవ్వకుండా ముఖం చాటేయడంతో, మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిన్న రాత్రి నిందితురాలిని అరెస్ట్ చేశారు. విచారణలో మరికొందరి నుంచి కూడా ఇదే విధంగా డబ్బులు వసూలు చేసినట్లు జ్యోతి ఒప్పుకుందని పోలీసులు తెలిపారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ డా.బి. అనురాధ, వనస్థలిపురం ఏసీపీ పి. కాశీరెడ్డి పర్యవేక్షణలో నిందితురాలిని అరెస్ట్ చేసి, కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవిబాబు వివరించారు.

# టెక్నాలజీతో ట్రీట్‌మెంట్... అపోలో హాస్పిటల్స్ స్మార్ట్ ఫెసిలిటీ ఓపెన్!


హైదరాబాద్ గ్లోబల్ హెల్త్‌కేర్ హబ్‌గా మారుతున్న తరుణంలో, అపోలో హాస్పిటల్స్ మరో ముందడుగు వేసింది. గచ్చిబౌలిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన 76వ హాస్పిటల్‌ను ప్రారంభించింది. ఏఐ పవర్డ్ ట్రీట్‌మెంట్, డిజిటల్ సిస్టమ్స్‌తో రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ 400 పడకల స్మార్ట్ హాస్పిటల్ అందుబాటులోకి వచ్చింది. వైద్య రంగంలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ, సామాన్యులకు కూడా కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేసే దిశగా అపోలో ఈ భారీ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అపోలో గ్రూప్ తన 76వ ఆసుపత్రిని అత్యంత వైభవంగా ప్రారంభించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కొత్త స్మార్ట్ ఫెసిలిటీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అపోలో గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి, శోభన కామినేని, డాక్టర్ సంగీత రెడ్డితో పాటు యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. ఇక తెలంగాణలో అపోలో గ్రూప్‌కు ఇది ఐదో హాస్పిటల్ కావడం విశేషం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వైద్యం కోసం ప్రపంచ దేశాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు వస్తున్నారని, ఇది మన నగరానికి గర్వకారణమని కొనియాడారు. ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం అంతర్జాతీయ విమాన సర్వీసులను పెంచాలని కేంద్ర విమానయాన శాఖను కోరినట్లు ఆయన తెలిపారు. తక్కువ ధరకే నాణ్యమైన వైద్యాన్ని సామాన్యులకు అందిస్తున్న అపోలో సంస్థను ఆయన



అభినందించారు. ఈ కొత్త ఆసుపత్రి కేవలం భవనం మాత్రమే కాదు, ఇదొక 'స్మార్ట్' సెంటర్. ఇక్కడ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో రోగుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తారు. డిజిటల్ సిస్టమ్స్ ద్వారా డాక్టర్లు ఎప్పటికప్పుడు రిపోర్టులను చెక్ చేయవచ్చు. అత్యుత్తమ ఐసీయూ మౌలిక సదుపాయాలు, ఎమర్జెన్సీ సేవల కోసం ప్రత్యేక విభాగాలు ఇక్కడ ఉన్నాయి. రోగుల ప్రైవసీకి, సౌకర్యానికి పెద్దపీట వేస్తూ గ్లోబల్ సేఫ్టీ ప్రోటోకాల్స్‌ను ఇక్కడ అమలు చేస్తున్నారు. డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి మాట్లాడుతూ.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, రాకుండా చూసుకోవడమే ముఖ్యమని చెప్పారు. ఇందులో భాగంగా నానక్‌రామ్‌గూడ పరిసర ప్రాంత ప్రజల కోసం ఒక గొప్ప ప్రకటన చేశారు. ప్రతి ఆదివారం 10,000 మందికి ఉచితంగా హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు చేస్తామని ప్రకటించారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలన్నదే తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఉపాసన కామినేని కొణిదెల కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పని చేసే తల్లులకు అపోలో వంటి సంస్థలు ఇచ్చే మద్దతు చాలా గొప్పదని ఆమె అన్నారు. డాక్టర్ సంగీత రెడ్డి తనకు మెంటార్‌గా ఉండి, హెల్త్‌కేర్ రంగంలో ముందుకు నడిపిస్తున్నారని ఉపాసన పేర్కొన్నారు. అపోలో ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో తమ వంతు కృషి చేస్తామని ఆమె వెల్లడించారు. సాంకేతికత ఎంత పెరిగినా, వైద్యంలో మానవత్వం ఉండాలనేది అపోలో సిద్ధాంతం. ఈ కొత్త స్మార్ట్ హాస్పిటల్ హైదరాబాద్ వాసులకే కాకుండా, పొరుగు రాష్ట్రాల వారికి కూడా వరంగా మారనుంది. అత్యాధునిక ఏఐ టెక్నాలజీ మరియు నిపుణులైన డాక్టర్ల సేవలతో, అపోలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. త్వరలోనే ఈ హాస్పిటల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి వేలమందికి ప్రాణదానం చేయనుంది.

# గగనతల రక్షణకు భారత్ కు మరో ఆయుధం.. వచ్చే నెలలో పంపించనున్న రష్యా.. శత్రువులకు వణుకు!

భారత్-రష్యా మైత్రి అంటే ఎలాంటిదో చెప్పడం కష్టం.. ప్రపంచంలో ఏ దేశానికి ఇవ్వని విలువను రష్యా భారత్ కు ఇస్తుంది. ఇరు దేశాల మధ్య ఉన్న మైత్రి అంత బలంగా ఉంటుంది. ఒక వైపు ఉక్రెయిన్ తో యుద్ధం జరుగుతున్నా.. అంతర్జాతీయంగా సరఫరా గొలుసులో ఇబ్బందులు ఉన్నప్పటికీ, రష్యా అత్యంత శక్తివంతమైన ూ-400 ట్రయంఫ్ క్షిపణిని భారత్ కు అందించడం రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు నిదర్శనం. వచ్చే నెలలో భారత్ కు చేరుకోబోయే నాలుగో యూనిట్ భారత రక్షణ కవచాన్ని మరింత పటిష్టం చేయబోతోంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తన అమ్ములపొదిలోకి మరో శక్తివంతమైన ఆయుధాన్ని చేర్చుకోబోతోంది. రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఐదు ఎస్-400 యూనిట్లలో నాలుగోది వచ్చే నెలలో భారత్‌కు చేరనుంది. సుమారు ?35,000 కోట్లకు పైగా విలువైన ఈ ఒప్పందంలో భాగంగా ఇప్పటికే మూడు యూనిట్లను రష్యా భారత్ కు ఇచ్చింది. వీటిని చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో వ్యూహాత్మకంగా మోహరించారు. ఇప్పుడు రాబోయే నాలుగో యూనిట్‌ను రాజస్థాన్ సెక్టార్‌లో మోహరించడం ద్వారా పశ్చిమ సరిహద్దులో నిఘాను వంద శాతం పటిష్టం చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఎస్-400 ఎందుకింత స్పెషల్.. ప్రపంచంలోనే అత్యుత్తమ గగనతల రక్షణ వ్యవస్థ (ఎయిర్ డిఫెన్స్ సిస్టం)గా దీనికి గుర్తింపు ఉంది. అమెరికాకు చెందిన 'పాట్రియాట్'



వ్యవస్థ కంటే ఇది ఎంతో మెరుగైనదని రక్షణ నిపుణులు చెబుతుంటారు. ఇది 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు విమానాలు, బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లను సెకన్ల వ్యవధిలో గుర్తించి కూల్చివేయగలదు. ఒకేసారి దాదాపు 100 లక్ష్యాలను ట్రాక్ చేయడమే కాకుండా, అందులో అత్యంత ప్రమాదకరమైన 36 లక్ష్యాలపై ఏకకాలంలో దాడులు చేయగల సామర్థ్యం దీని సొంతం. ఇందులో షార్ట్, మిడ్, లాంగ్ రేంజ్ క్షిపణులు ఉంటాయి. దీనివల్ల శత్రువు ఏ ఎత్తులో వచ్చినా వీటి నుంచి తప్పించుకోవడం దాదాపు అసాధ్యం. ఘాశ్రీంశీ =ఘుఎ - నువ్వు 'సింగం' అయితే.. నేను 'పుష్ప': ఐపీఎస్‌కు నేత వార్నింగ్ వ్యూహాత్మక మోహరింపు.. రష్యా వచ్చే నెల అందజేసే నాలుగో యూనిట్‌ను రాజస్థాన్‌లో మోహరించాలని ఆర్మీ వర్గాలు తెలిపాయి. రాజస్థాన్ సరిహద్దు నుంచి పాకిస్థాన్ లోపలి భూభాగాలను, ముఖ్యంగా వారి ఎయిర్ బేస్‌లను మనం నిరంతరం పర్యవేక్షించవచ్చు. శత్రు విమానం వారి గడ్డపై టేకాఫ్ అయిన నిమిషంలోనే మన రాడార్లకు చిక్కిపోతుంది. ఇటీవల సరిహద్దుల్లో డ్రోన్ల ద్వారా ఆయుధాల రవాణా పెరుగుతోంది. ఎస్-400 లోని అత్యాధునిక రాడార్లు చిన్నపాటి డ్రోన్లను గుర్తించి నాశనం చేయగలవు. అమెరికా ఆంక్షలను కాదని భారత్ సాహసం రష్యా నుంచి ఆయుధాలు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా 'కాట్సా' చట్టం విధిస్తుంది. అయినప్పటికీ భారత్ తన జాతీయ భద్రత దృష్ట్యా అమెరికా ఒత్తిళ్లను తట్టుకొని ఈ ఒప్పందాన్ని చేసుకుంది. ఇది భారత స్వతంత్ర విదేశీ విధానానికి నిదర్శనం. వచ్చే నవంబర్‌లో ఐదో యూనిట్ కూడా వస్తే, లడఖ్ నుంచి కన్యాకుమారి వరకు భారత గగనతలం అజేయమైన కోటలా మారుతుంది. ూ-400ను మనం దిగుమతి చేసుకుంటున్నప్పటికీ, ఇదే తరహాలో భారత్ సొంతంగా 'కుషా' (ప్రాజెక్టు కుషా) పేరుతో సుదూర పరిధి క్షిపణి రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. రాబోయే ఐదేళ్లలో ఇలాంటి వ్యవస్థల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం భారత్ కు ఉండదు. ూ-400 రాకతో మన సైనికుల మనోధైర్యం పెరగడమే కాకుండా, ప్రత్యర్థులు మన సరిహద్దుల వైపు చూడాలంటేనే భయపడతారు.

# తెలంగాణలో ఆస్తుల రిజిస్ట్రేషన్ భారం..

# మే మొదటి వారం నుంచి కొత్త విలువలు అమలు!



తెలంగాణలో ఇల్లు లేదా భూమి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది ముఖ్యమైన వార్త. రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల రిజిస్ట్రేషన్ల కోసం నిర్ధారించిన ప్రభుత్వ మార్కెట్ విలువలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సవరించిన ఈ కొత్త విలువలు మే మొదటి వారం నుంచే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో ఆస్తుల కొనుగోలుదారులపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం గణనీయంగా పెరగనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని వనరుల సమీకరణపై ఏర్పాటైన కేబినెట్ ఉపసంఘం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గత శుక్రవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆమోదించారు. మార్కెట్ విలువలను సవరించి, కొత్త రేట్లను అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు, సాంకేతిక ఏర్పాట్లు చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను కేబినెట్ ఉపసంఘం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రభుత్వ మార్కెట్ విలువలకు, బహిరంగ మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ఈ పెంపు వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఈ చర్య ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనం లావాదేవీలు తగ్గి, పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సవరణ ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు అదనంగా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెట్ విలువల సవరణ చేపట్టడం ఇదే తొలిసారి. గతంలో 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం విలువలను సవరించింది. వాస్తవానికి, ఏడాది క్రితమే విలువలను పెంచాలని భావించినా, రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న మందగమనం కారణంగా ఆ ప్రతిపాదనను వాయిదా వేశారు.

# మైక్రోసాఫ్ట్ యూజర్లకు గుడ్ న్యూస్

**అప్ డేట్స్ వాయిదా వేసుకోవచ్చు!**

**విండోస్ 11 ఏప్రిల్ అప్‌డేట్‌తో యూజర్లకు తీవ్ర ఇబ్బందులు**

**కొన్ని సిస్టమ్స్‌లో బూట్ లూప్, బిట్‌లాకర్ రికవరీ సమస్యలు**

**అప్‌డేట్లపై యూజర్లకు మరింత కంట్రోల్ ఇచ్చేందుకు కొత్త ఫీచర్లు**

**అప్‌డేట్లను నిరవధికంగా పాజ్ చేసే సౌకర్యం కల్పించనున్న మైక్రోసాఫ్ట్**




విండోస్ 11 యూజర్లను చాలాకాలంగా వేధిస్తున్న అప్‌డేట్ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా మైక్రోసాఫ్ట్ కీలక అడుగులు వేస్తోంది. బలవంతపు అప్‌డేట్లకు చెక్ పెడుతూ, యూజర్ల చేతికి పూర్తి నియంత్రణ ఇచ్చేలా కొత్త ఫీచర్లను పరీక్షిస్తోంది. అదే సమయంలో, ఏప్రిల్ నెలలో విడుదల చేసిన ఓ సెక్యూరిటీ అప్‌డేట్ వల్ల తలెత్తిన సమస్యలనూ పరిష్కరించే పనిలో పడింది. వివరాల్లోకి వెళ్తే, విండోస్ 11 కోసం ఏప్రిల్‌లో విడుదల చేసిన ఖదీ5083769 సెక్యూరిటీ అప్‌డేట్ కొందరు యూజర్లకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తోంది. ఈ అప్‌డేట్ ఇన్‌స్టాల్ చేశాక కొన్ని కంప్యూటర్లు పదేపదే బూట్ అవ్వడం (బూట్ లూప్స్), బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ వంటి సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా హెచ్‌పీ, డెల్ సిస్టమ్స్‌లో ఈ సమస్య ఎక్కువగా ఉందని యూజర్లు రిపోర్ట్ చేస్తున్నారు. అయితే, కొన్ని ప్రత్యేక గ్రూప్ పాలసీ కాన్ఫిగరేషన్లు ఉన్న డివైజ్‌లలో బిట్‌లాకర్ రికవరీ సమస్య వస్తోందని మైక్రోసాఫ్ట్ అధికారికంగా అంగీకరించింది. ఈ నేపథ్యంలో, యూజర్ల ఫీడ్‌బ్యాక్‌కు స్పందిస్తూ మైక్రోసాఫ్ట్ కొత్త అప్‌డేట్ కంట్రోల్ ఫీచర్లను 'విండోస్ ఇన్‌సైడర్ ప్రోగ్రామ్'లో పరీక్షిస్తోంది. దీని ప్రకారం, యూజర్లు అప్‌డేట్లను 35 రోజుల వరకు పాజ్ చేయొచ్చు. ఈ గడువు ముగిశాక మళ్లీ పాజ్ చేసి, నిరవధికంగా వాయిదా వేసుకోవచ్చు. అలాగే, కంప్యూటర్ షట్‌డౌన్ లేదా రీస్టార్ట్ చేసేటప్పుడు అప్‌డేట్ తప్పనిసరి కాకుండా, సాధారణ ఆప్షన్లు కూడా అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం ఈ కొత్త ఫీచర్లు టెస్టింగ్ దశలో ఉండగా, త్వరలోనే సాధారణ యూజర్లందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.


# ముఖేశ్ అంబానీని దాటిన గౌతమ్ అదానీ

**ఆసియాలో అత్యంత ధనవంతుడిగా**

**బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్ల జాబితాలో ఆసియాలో అత్యంత సంపన్నుడిగా గౌతమ్**

**ముకేశ్ అంబానీని దాటి మొదటిస్థానంలో చేరుకున్న గౌతమ్ అదానీ**

**ప్రపంచ కుబేరుల జాబితాలో 19వ స్థానంలో ఉన్న అదానీ**



అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా మరోసారి అవతరించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి మొదటిస్థానంలోకి దూసుకెళ్లారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, గౌతమ్ అదానీ సంపద 92.6 బిలియన్ డాలర్లు ఉంది. ముకేశ్ అంబానీ సంపద 90.8 బిలియన్ డాలర్లుగా ఉంది. పోర్ట్స్ నుంచి ఎనర్జీ వరకు విస్తరించిన అదానీ గ్రూప్ షేర్లకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఓడరేవుల నెట్‌వర్క్, పునరుత్పాదక ఇంధనం, విమానాశ్రయాల నిర్వహణలో అదానీ గ్రూప్ దూసుకుపోతోంది. ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ రంగంలో అదానీ భారీ పెట్టుబడులు పెడుతోంది. దీంతో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ 200 బిలియన్ డాలర్లు దాటింది. ఇక, అదానీ గ్రూప్ స్టాక్స్ కూడా ఇటీవల భారీగా పెరిగాయి. అలాగే, అదానీ పవర్ 1 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 2 శాతం, అదానీ ఎనర్జీ, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌తో పాటు ఇతర కంపెనీల స్టాక్స్ నేటి ట్రేడింగ్‌లో లాభాల్లో కొనసాగుతున్నాయి. స్టాక్ ధరలు, వ్యాపార పనితీరు ఆధారంగా ఈ ర్యాంకుల్లో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతుంటాయి. అటు ప్రపంచ కుబేరుల జాబితాలో గౌతమ్ అదానీ 19వ స్థానంలో ఉన్నారు. ఇక ప్రపంచ స్థాయిలో చూస్తే! ఇదిలా ఉండగా, ప్రపంచ స్థాయిలో చూస్తే, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఆయన నికర సంపద సుమారు 656 బిలియన్ డాలర్లుగా ఉంది. అలాగే, గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ పేజ్ 286 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలిచారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 269 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఉన్నారు. అయితే, ప్రపంచ టాప్ 50 ధనవంతుల జాబితాలో భారత్ నుంచి ఉన్నవారు అదానీ, అంబానీ ఇద్దరే కావడం విశేషం. 'హిండెన్‌బర్గ్ నివేదికతో అదానీ గ్రూప్‌నకు గట్టి దెబ్బ' గత దశాబ్దానికి పైగా అంబానీ భారతదేశంలో అత్యంత ధనవంతుడిగా కొనసాగారు. 2022లో అదానీ గ్రూప్ షేర్ల పెరుగుదలతో మొదటిసారి ఆయన అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. అయితే, అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికతో అదానీ గ్రూప్‌నకు భారీ దెబ్బ తగిలింది. దీంతో మార్కెట్ విలువలో 100 బిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లింది. అనంతరం అంబానీ మళ్లీ టాప్ స్థానాన్ని దక్కించుకున్నారు. అలాగే, 2024 మధ్యకాలంలో మౌలిక వసతుల విస్తరణ, ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెరగడం వల్ల ఆయన కంపెనీల షేర్లు మళ్లీ పుంజుకున్నాయి. దీంతో అదానీ మళ్లీ అంబానీని అధిగమించారు. 2025లో కొంతకాలం అంబానీ తిరిగి టాప్‌లోకి వచ్చినా, ఈ నెలలో మళ్లీ అదానీ ముందంజలోకి వచ్చారు. ఆహారం, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, బిజినెస్ ఇంక్యుబేషన్ వంటి రంగాల్లో, డేటా సెంటర్లు, సిమెంట్, మీడియా, రోడ్లు, రైల్వేలు, రియల్ ఎస్టేట్, ఎఫ్‌ఎంసీజీ వంటి అనేక రంగాల్లో విస్తరించి ఉంది. ఇక భారత్ నుంచి చూస్తే, షాపూర్ మిస్త్రీ వారి కుటుంబం, సావిత్రి జిందాల్, లక్ష్మీ మిత్తల్, శివ్ నాడార్, , కుమార మంగళం బిర్లా, సునీల్ మిత్తల్ వారి కుటుంబం, రాధాకృష్ణ ధమానీ, అజీమ్ ప్రేమ్‌జీ బిలియనీర్ ఇండెక్స్‌లో కొనసాగుతున్నారు. గతేడాది, 2024-25 ఆర్థిక సంవత్సరంలో గౌతమ్ అదానీ మొత్తం రూ.10.41 కోట్ల వేతనం అందుకున్నారు. 2023-24లో ఆయన తీసుకున్న రూ.9.26 కోట్లతో పోలిస్తే అది 12% ఎక్కువ. అయితే పరిశ్రమ ప్రముఖులతో పాటు సొంత కంపెనీ ఎగ్జిక్యూటివ్‌ల వేతనం కంటే అదానీ తక్కువ అందుకున్నారు. ఇక, అదానీ కుమారుడు కరణ్ అదానీ, అదానీ పోర్ట్స్ నుంచి రూ.7.09 కోట్లు అందుకున్నారు.

# "హోమ్ లోన్" ఎక్కువగా రావాలంటే



**ఈ "సీక్రెట్స్" తెలుసుకోవాల్సిందే!**

**ఎక్కువ మొత్తంలో "హోమ్ లోన్" కావాలా**

**ఈ టిప్స్‌తో మీ పని ఈజీ అవుతుందంటున్న నిపుణులు!**

ఇటీవల కాలంలో చాలా మందిలో సొంతింటి ఆలోచన పెరిగింది. ఈ కలను సాకారం చేసుకునేందుకు ఎంతో శ్రమిస్తుంటారు. అయితే, ఇంటి పనిలోకి దిగాక ఖర్చు అంచనా వేసిన దానికంటే ఎక్కువగా అవుతుంటుంది. అప్పుడు చాలా మందికి ముందుగా గుర్తొచ్చేవి "హోమ్ లోన్స్". ఇందుకు తగ్గట్టే బ్యాంకులు, హోమ్ లోన్ కంపెనీలు రుణాలు ఇస్తుంటాయి. అయితే, మీరు తీసుకునే హోమ్ లోన్ అవసరమైనంత రావాలంటే ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే లోన్ మొత్తం పెరుగుతుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం. కొత్తగా ఇల్లు కట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నవారు కొన్ని టిప్స్‌తో కావాల్సినంత హోమ్ లోన్ పొందవచ్చంటున్నారు ఆర్థిక నిపుణులు. అలాంటి వాటిల్లో కొన్నింటిని ఇప్పుడు చూద్దాం. **క్రెడిట్ స్కోర్ 750+ ఉంటే** :ప్రస్తుతం మీరు ఎలాంటి లోన్స్ తీసుకోవాలన్నా క్రెడిట్ స్కోర్ అనేది కీలకంగా మారింది. ముఖ్యంగా లోన్ల విషయంలో బ్యాంకులు లేదా హోమ్ లోన్ సంస్థలు ముందుగా క్రెడిట్ స్కోర్ చూస్తాయి. దీనితో మీ క్రెడిట్ హిస్టరీ, మీ ఆర్థిక అలవాట్లను పరిశీలిస్తాయి. అప్పుడు మీ క్రెడిట్ స్కోర్ 750+ లేదా అంతకంటే ఎక్కువ ఉంటే మీకు కావాల్సినంత హోమ్ లోన్ ఈజీగా వస్తుందంటున్నారు నిపుణులు. అలాగే, వడ్డీ రేటు కూడా తగ్గే ఛాన్స్ ఉంటుంది. మీ క్రెడిట్ స్కోర్ 800 దాటితే వడ్డీలో 0.5 శాతం వరకు తగ్గింపు కూడా లభిస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఉన్న రుణాలకు సంబంధించిన ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులు సకాలంలో చెల్లించడం ద్వారా మంచి క్రెడిట్ స్కోర్ సాధించవచ్చంటున్నారు. **జాయింట్ లోన్** :మీ కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదిస్తుంటే జాయింట్ లోన్ తీసుకోవచ్చు. దీని వల్ల ఎక్కువ మొత్తంలో లోన్ దక్కుతుంది. ఈ లోన్ మీ జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు ఎవరితోనైనా కలిసి తీసుకోవచ్చు. ఇలా జాయింట్ లోన్ తీసుకోవడం వల్ల హోమ్ లోన్ త్వరగా రావడమే కాదు ఈఎంఐ భారం కూడా తగ్గుతుందంటున్నారు నిపుణులు. అలాగే, ఇద్దరికి ఆదాయపు పన్ను మినహాయింపు కూడా లభిస్తుందని చెబుతున్నారు. **ఎక్కువ వ్యవధి ఉండేలా** :మీకు పెద్ద మొత్తంలో లోన్ కావాల్సినప్పుడు తిరిగి చెల్లించే వ్యవధిని కూడా వీలైనంత ఎక్కువకాలం ఉండేలా చూసుకోవాలంటున్నారు. దీని వల్ల ఈఎంఐ భారం తగ్గి లోన్ మొత్తం పెరుగుతుందని సూచిస్తున్నారు. అయితే, ఇలాంటి టైమ్‌లో వడ్డీ మాత్రం కాస్త అధికంగానే ఉంటుందని గుర్తుంచుకోవాలి. **తక్కువ** :హోమ్ లోన్ ఎక్కువ మొత్తంలో రావాలంటే మీకు ఉన్న ఇతర అప్పులను క్లియర్ చేసుకోవడం బెటర్. ఇప్పటికే ఉన్న ఈఎంఐలు కొత్త లోన్‌కు అడ్డంకిగా మారే అవకాశం ఉంటుంది. ఇంకా క్లియర్‌గా చెప్పాలంటే ఆదాయంలో 40 శాతానికి మించి జువీ×లు లేకుండా చూసుకోవాలి. మరీ తప్పనిసరి అయితే 50 శాతం వరకు ఈఎంఐలు ఉండొచ్చు. **ఇతర ఆదాయ మార్గాలు** :మీకు జీతంతోపాటు ఇతర ఆదాయ మార్గాలు ఉంటే వాటిని కూడా బ్యాంకుకు తెలియజేయాలి. అంటే ఉదాహరణకు ఇంటి రెంట్లు, బిజినెస్, వ్యవసాయం, వడ్డీలు ఇలా అన్ని రకాల ఆదాయ మార్గాలను లోన్ అప్లికేషన్‌లో పేర్కొనాలి. ఇవి కూడా మీరు లోన్ మొత్తం పెంచుకునేందుకు చాలా బాగా ఉపయోగపడతాయంటున్నారు ఆర్థిక నిపుణులు. చివరగా.. హోమ్ లోన్ అనేది సుదీర్ఘకాలం కొనసాగుతుంది. ఇది రుణగ్రహీత ఆర్థిక భవిష్యత్తును, ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి, హోమ్ లోన్ తీసుకునేవారు ఒకటికి రెండు సార్లు ఆలోచించి అవసరమైనంత మేరకే లోన్ తీసుకోవడం బెటర్ అంటున్నారు. అలాగే, పత్రాల విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకులు లోన్ మంజూరు కోసం అనేక పత్రాలపై సంతకం తీసుకుంటాయి. అందుకే, సంతకం చేసే ముందు అన్ని పత్రాలను వివరంగా చదవాలి. నియమ నిబంధనలలో ఉన్న చిన్న పాయింటు కూడా భవిష్యత్తులో మీకు ఇబ్బంది కలిగించవచ్చనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు.

## మీరు ఉంటున్న అద్దె ఇల్లు కొనాలనుకుంటున్నారా

**ఈ విషయాలు తెలుసుకోండి!**



అద్దె ఇంట్లో ఉంటూ అదే ఇంటిని సొంతం చేసుకోవాలని అనుకోవడం చాలామంది అద్దెదారుల కల. పెరుగుతున్న అద్దెల దృష్ట్యా, తెలిసిన పరిసరాల్లోనే స్థిరపడటం సౌకర్యవంతంగా అనిపించవచ్చు. అయితే, కేవలం ఆ ఇల్లు మీకు బాగా తెలుసు కదా అని గుడ్డిగా కొనుగోలు చేయడం ప్రమాదకరమని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని గురించి మరిన్ని వివరాల్లోకి వెళ్తే..బెంగుళూరు వంటి మెట్రో నగరాల్లో అద్దెలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో, చాలామంది అద్దెదారులు తాము ఉంటున్న అపార్ట్‌మెంట్‌నే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉదాహరణకు, హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్‌లో రూ. 23,000 అద్దె చెల్లిస్తున్న సందీప్ అనే వ్యక్తికి తన యజమాని ఆ ఇంటిని రూ. 80 లక్షలకు అమ్ముతానని ఆఫర్ ఇచ్చారు. ఇంటిపై ఉన్న మమకారంతో ఆయన కొనేయాలనుకున్నారు కానీ, లోతుగా విచారిస్తే ఆ ఆస్తిపై కోర్టు కేసులు ఉన్నాయని తేలింది. అందుకే అద్దెదారుల నియమాల (ఎవఖుత్ తీబశ్రీవం) ప్రకారం మీరు అద్దెదారుగా ఉన్నా, కొనుగోలుదారుగా మారేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. **1. అసలైన మార్కెట్ విలువను తెలుసుకోండి**మీరు ఉంటున్న ఇల్లు కదా అని యజమాని చెప్పిన ధరకే కొనేయకండి. ఆ బిల్డింగ్ వయస్సు, ప్రస్తుత పరిస్థితిని బట్టి ధరను నిర్ణయించాలి. స్థానిక బ్రోకర్లను సంప్రదించి, అదే అపార్ట్‌మెంట్‌లో లేదా ఆ ఏరియాలో ఇటీవల జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు సేకరించండి. కేవలం సౌకర్యం కోసం మార్కెట్ రేటు కంటే ఎక్కువ చెల్లించడం తెలివైన పని కాదు. **2. చట్టపరమైన హక్కులు ఇవే..**ఇంటి మొదటి యజమాని నుండి ప్రస్తుత సెల్లర్ వరకు యాజమాన్య గొలుసు స్పష్టంగా ఉందో లేదో తనిఖీ చేయాలి. సేల్ డీడ్, కన్వేయెన్స్ డీడ్ వంటి పత్రాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో స్వయంగా సరిచూసుకోవాలి. యజమాని ఇచ్చిన కాపీలపైనే ఆధారపడకుండా, సర్టిఫైడ్ కాపీలను స్వయంగా తీసుకోవడం ఉత్తమం. హోమ్ లోన్ తీసుకోవడం వల్ల బ్యాంక్ కూడా తన వంతుగా లీగల్ వెరిఫికేషన్ చేస్తుంది కాబట్టి మీకు అదనపు భద్రత లభిస్తుంది. **3. భవనం వయస్సు , భవిష్యత్తు ఖర్చులు**పాత అపార్ట్‌మెంట్‌లు తక్కువ ధరకు లభించినప్పటికీ, భవిష్యత్తులో మెయింటెనెన్స్ ఖర్చులు భారీగా ఉండవచ్చు. ఆ బిల్డింగ్ స్ట్రక్చరల్ లైఫ్ ఎంత? ఏదైనా రీడెవలప్‌మెంట్ ప్లాన్ ఉందా? అనేది ముందే తెలుసుకోవాలి. సొసైటీ మీటింగ్‌లలో పాల్గొని భవనం పరిస్థితిని ఆరా తీయండి. **4. కేసులు , అప్పులు లేవని నిర్ధారించుకోండి**ఆస్తిపై ఎటువంటి కోర్టు వివాదాలు లేవని నిర్ధారించుకోవడానికి యజమాని పేరు మీద కోర్టు రికార్డులను శోధించాలి. అలాగే, ఆ ఇంటిపై ఏవైనా బ్యాంక్ అప్పులు ఉన్నాయా అనేది ఎన్కంబరెన్స్ సర్టిఫికేట్ ద్వారా తనిఖీ చేయాలి. ఆస్తిపై ఎటువంటి క్లెయిమ్‌లు లేవని సేల్ డీడ్‌లో స్పష్టంగా పేర్కొనాలి. భావోద్వేగంతో కాకుండా వాస్తవాలతో ఆలోచించండిఅద్దె ఇంట్లో ఉండటం వల్ల మీకు ఆ ఇల్లు , పరిసరాలు బాగా తెలుస్తాయి, ఇది ఒక అడ్వాంటేజ్. కానీ ఇదే మీ జాగ్రత్తను తగ్గించకూడదు. అద్దెదారులుగా మీరు పాటించే రూల్స్ వేరు, కొనుగోలుదారుగా మీరు చేసే 'డ్యూ డిలిజెన్స్' వేరు. ధర విషయంలో బేరమాడండి, లీగల్ టైటిల్ క్లియర్ గా ఉంటేనే ముందడుగు వేయండి. బెంగళూరు వంటి నగరాల్లో ఇలాంటి విషయాల్లో జాగ్రత్త వహించడం ముఖ్యం. తద్వారా మీ కష్టార్జితం సురక్షితంగా ఉంటుంది , మీ సొంత ఇంటి కల నిజమైన సుఖాన్ని ఇస్తుంది.


## పెన్షనర్లు, ఉద్యోగులకు పెరగనున్న జీతాలు

**క్యాబినెట్ కీలక నిర్ణయాలు ఇవే!**




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు , పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో డియర్నెస్ అలవెన్స్ పెంపునకు ఆమోదం లభించింది. దీంతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలకు కూడా క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు , పెన్షనర్లు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డీఏ హైక్ పై ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. కేంద్ర క్యాబినెట్ తాజా సమావేశంలో కరువు భత్యం , కరువు ఉపశమనం (ఙ=)లను 2 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ద్రవ్యోల్బణ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం ప్రతి ఏటా జనవరి , జూలై నెలల్లో ఈ అలవెన్స్‌లను సవరిస్తూ ఉంటుంది. లేబర్ బ్యూరో విడుదల చేసే కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా ఈ పెంపును లెక్కిస్తారు. ఆలస్యమైనా అందిన ఊరటసాధారణంగా సెప్టెంబర్ ఆఖరులో లేదా అక్టోబర్ ప్రారంభంలో ప్రకటించాల్సిన ఈ పెంపు, ఈసారి కొంత ఆలస్యమైంది. దీంతో సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ కాన్ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పుడు ప్రభుత్వం అధికారికంగా 2 శాతం పెంపును ప్రకటించడంతో, ఉద్యోగుల జీతాలు , పెన్షనర్ల నెలవారీ పెన్షన్లలో పెరుగుదల కనిపించనుంది. ఏరియర్స్ కూడా త్వరలోనే జమ అయ్యే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని వ్యాఖ్యలుక్యాబినెట్ సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వని పార్టీలు భవిష్యత్తులో రాజకీయ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రతిపక్షాల తీరు మహిళల పట్ల వారికున్న ప్రతికూల ధోరణిని ప్రతిబింబిస్తోందని, ఈ విషయాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బిల్లును వ్యతిరేకించడం ద్వారా వారు దేశ మహిళలను ఓడించారని ప్రధాని మండిపడ్డారు. మరికొన్ని కీలక నిర్ణయాలుకేవలం డీఏ హైక్ మాత్రమే కాకుండా, దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి కూడా క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుందిసావరిన్ మ్యారిటైమ్ ఫండ్: భారతీయ నౌకలకు తక్కువ ధరకు ఇన్సూరెన్స్ కవరేజీని అందించే లక్ష్యంతో రూ. 13,000 కోట్లతో ఈ కొత్త నిధిని ఏర్పాటు చేశారు. పీఎం గ్రామ్ సడక్ యోజన : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించారు. ఇందుకోసం అదనంగా రూ. 3,000 కోట్లు కేటాయించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుండి రక్షణప్రస్తుత ధరల పెరుగుదల నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన ఈ 2 శాతం డీఏ హైక్ ఉద్యోగులకు కొంత ఊరటనిస్తుంది. జీతంలో పెరుగుదల అనేది ఎప్పుడూ సానుకూల అంశమే అయినప్పటికీ, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ పెంపు సరిపోతుందా లేదా అనేది చర్చనీయాంశం. అయినప్పటికీ, పీఎం గ్రామ్ సడక్ యోజన పొడిగింపు , మ్యారిటైమ్ ఫండ్ ఏర్పాటు వంటి నిర్ణయాలు దేశ దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడతాయని చెప్పవచ్చు.

## వైసీ స్టార్టప్ స్కూల్: లోకల్ ఫౌండర్లకు సరికొత్త ఊతం



ఈ రోజంతా వర్క్‌షాప్‌లు, నెట్‌వర్కింగ్ సెషన్లతో బిజీగా సాగనుంది. ప్రొడక్ట్-మార్కెట్ ఫిట్, హైరింగ్ స్ట్రాటజీల గురించి నిపుణులు లోతుగా వివరిస్తున్నారు. చాలామంది ఇక్కడ తమకు తోడుగా ఉండే కో-ఫౌండర్ల కోసం లేదా తొలి ఇంజనీరింగ్ టీమ్ కోసం వెతుకుతున్నారు. ఈ వాతావరణం భవిష్యత్తులో భారత్ నుంచి మరిన్ని యూనికార్న్ కంపెనీలు పుట్టుకురావడానికి పునాది వేస్తోంది. స్టార్టప్ ప్రయాణానికి కావాల్సిన అన్ని మెళకువలను ఈ ఈవెంట్ అందిస్తోంది. హైదరాబాద్, నోయిడా వంటి ప్రాంతీయ టెక్ హబ్‌లలో కూడా దీనిపై విపరీతమైన ఆసక్తి కనిపిస్తోంది. స్థానిక భాషల్లో అందుబాటులో ఉన్న గైడ్‌లు వివిధ ప్రాంతాల ఫౌండర్లకు ఈ గ్లోబల్ రిసోర్సెస్‌ను అర్థం చేసుకోవడంలో సాయపడుతున్నాయి. చాలామంది కార్పొరేట్ ఉద్యోగులు తమ ఉద్యోగాలకు స్వస్తి చెప్పి, సొంతంగా స్టార్టప్ ప్రారంభించేందుకు ఈ వేదికను ఉపయోగించుకుంటున్నారు. భారతీయ యువత ఆలోచనా విధానంలో వస్తున్న మార్పుకు ఇది నిదర్శనం. సెషన్లు జరుగుతుండగానే సోషల్ మీడియాలో లైవ్ అప్‌డేట్స్, రీల్స్ ట్రెండ్ అవుతున్నాయి. ఇది కేవలం ఒక ఈవెంట్ మాత్రమే కాదు, భారత భవిష్యత్తు కోసం సాగుతున్న ఒక ఉద్యమం. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ తమ బిజినెస్ ఐడియాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలో ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో వెనుతిరుగుతారు. ఇక్కడ నేర్చుకున్న పాఠాలు రాబోయే దశాబ్ద కాలంలో దేశ ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తాయి. బెంగళూరు మరోసారి దేశపు అసలైన స్టార్టప్ రాజధాని అని నిరూపించుకుంది.



# గెటప్ రెడీ.. ఇక మిగిలింది యాక్షనే!



అగ్ర కథానాయకుడు చిరంజీవి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ ఓ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని చిరంజీవి పాత్రకు సంబంధించిన లుక్ టెస్ట్ విజయవంతంగా పూర్తయింది. ఇందులో మెగాస్టార్ పవర్‌ఫుల్, స్ట్రైకింగ్ లుక్‌లో కనిపిస్తారని లుక్ టెస్ట్‌ని బట్టి అర్థమవుతున్నది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి-బాబీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ రెండో చిత్రం మెగా అభిమానులకు విందు భోజనంలా ఉంటుందని సమాచారం. మాస్ ఎంటర్‌టైనర్స్ తీయడంలో సిద్ధహస్తుడైన బాబీ ఈసారి మెగాస్టార్ కోసం ఇంటెన్స్ క్యారెక్టర్‌ని డిజైన్ చేశారని, మెగాస్టార్ స్క్రీన్ ప్రెజెన్స్ మరింత ఎలివేట్ అయ్యేలా స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ముహూర్తం, రెగ్యులర్ షూటింగ్ వివరాలను మేకర్స్ త్వరలో ప్రకటిస్తారు.

# అరుదైన గౌరవం



ప్రస్తుతం యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' షూటింగ్‌లో బిజీగా ఉంది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. కేరళలో జరుగుతున్న తాజా షెడ్యూల్‌లో పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా త్వరలో రష్మిక మందన్న ఓ గ్లోబల్ ఈవెంట్‌లో సందడి చేయబోతున్నది. జపాన్‌లోని టోక్యోలో జరగనున్న గ్లోబల్ యానిమే అవార్డ్స్ వేడుకలో రష్మిక మందన్న ప్రజెంటర్‌గా వ్యవహరించనుంది. ప్రపంచవ్యాప్తంగా యానిమేషన్ రంగంలో అద్భుత ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన సాంకేతిక నిపుణులతో పాటు సినిమాలకు గత పదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. భారత్ నుంచి ఈ ఏడాది గ్లోబల్ యానిమే వేడుకలో పాల్గొంటున్న ఏకైక భారతీయ నటి రష్మిక మందన్న కావడం విశేషం. ఇదొక అరుదైన గౌరవమని అంటున్నారు. అయితే 2024లో జరిగిన గ్లోబల్ యానిమే ఈవెంట్‌లో కూడా రష్మిక మందన్న పాల్గొన్నది. ఈ వేడుకలో భాగమైన తొలి భారతీయురాలిగా ఆమె రికార్డు సృష్టించింది. మరోమారు రష్మిక మందన్న ఈ గ్లోబల్ ఈవెంట్‌లో పాల్గొనడం ప్రాధాన్యతను సంతరించుకుంది.




# బాలీవుడ్‌లో మైథలాజికల్ జంగిల్ డ్రామా?

తమిళ అగ్ర కథానాయకుడు ధనుష్ హీరోగా బాలీవుడ్‌లో ఓ మైథాలాజికల్ జంగిల్ డ్రామా తెరకెక్కనున్నది. కోలీవుడ్ ఫిల్మ్ మేకర్ పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి బాలీవుడ్ అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ నిర్మాత. ఈ ప్రాజెక్ట్‌కు హీరోగా ముందు రామ్‌చరణ్‌ను అనుకున్నారట. కొన్ని కారణాల వల్ల చర్చలు కార్యరూపం దాల్చకపోవడంతో ఈ సినిమా ధనుష్ కాంపౌండ్‌కు చేరిందంటూ బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. ఓ పౌరాణిక గాథ ఆధారంగా అటవీ నేపథ్యంలో ఈ కథ సాగుతుందట. దర్శకుడు పీఎస్ మిత్రన్ తమిళంలో తెరకెక్కించిన ఇరుంబు తిరై, సర్దార్ చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో పాటు భన్సాలీతో ఆయనకు ఉన్న అనుబంధం కారణంగా ఈ ప్రాజెక్ట్ మిత్రన్‌కి దక్కిందని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది.

# పుట్టినరోజు కానుకగా...



హీరో ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా తన అభిమానులకు ఓ కానుక ఇవ్వనున్నారు. మే 20న ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా ఆయన హీరోగా నటించిన 'ఊసరవెల్లి' సినిమా రీ రిలీజ్ కానుంది. ఎన్టీఆర్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఊసరవెల్లి'. తమన్నా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో తనికెళ్ల భరణి, ప్రకాశ్‌రాజ్, విద్యుత్ జమాల్, సాయాజీ షిండే, మురళీ శర్మ తదితరులు ఇతరపాత్రలు పోషించారు. బి. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా 2011 అక్టోబరు 6న రిలీజ్ అయింది. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ప్లస్‌గా నిలిచింది. కాగా 'ఊసరవెల్లి' చిత్రం సుమారు పదిహేనేళ్ల తర్వాత మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తోంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ సినిమాని రీ రిలీజ్ చేస్తున్నారు. ఇక ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్). ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2027 జూన్ 11న రిలీజ్ కానుంది.



# కింగ్ 100.. 'శివ' లుక్‌తో నాగార్జున

టాలీవుడ్ కింగ్ నాగార్జున తన వందో సినిమాను ఎంతో ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పేదరికం నుంచి సంపన్నుడిగా ఎదిగిన ఫార్ములా కథతో సాగనుందని తెలుస్తోంది. ఇందులో నాగ్ ఒక షేడ్‌లో 25 ఏళ్ల యువకుడిలా కనిపించనున్నారని సమాచారం. దాని కోసం చిరంజీవి ఆచార్యలో, రజనీకాంత్ కూలీలో వాడిన అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నారట. అంటే దాదాపు శివ సినిమాలో నాగార్జున ఎలా కనిపించారో, అదే వింటేజ్ లుక్‌ను ఈ పాత్రలో మళ్లీ చూపించనున్నారు. ఆచార్య వచ్చిన సమయంలో ఈ టెక్నాలజీ ఖరీదైనది. కానీ ఇప్పుడు ఏఐ అందుబాటులోకి రావడంతో ఖర్చు తగ్గింది, దాంతో వాడకం చాలా సులభమైంది. ఇక దీంతో నాగార్జున వందో సినిమా మరింత ప్రత్యేకంగా మారే అవకాశం ఉంది. కాగా ఈ చిత్రంలో టబు ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. నాగార్జున-టబు జంట 28 ఏళ్ల తర్వాత మళ్లీ తెరపై కనిపించనుంది. గతంలో వీరిద్దరూ నటించిన నిన్నే పెళ్ళాడతా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. చివరిగా వీరు ఆవిడా మా ఆవిడే చిత్రంలో నటించారు. ప్రస్తుతం టబు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 75 శాతం పూర్తయింది. దసరా తర్వాత విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. అయితే టైటిల్ నుంచి రిలీజ్ డేట్ వరకు ఏదీ ఇప్పట్లో ప్రకటించే ఉద్దేశం లేదు. సినిమా పూర్తయిన తర్వాతే ప్రచారం మొదలుపెట్టాలని నాగ్ నిర్ణయించారు. ఇలా నాగార్జున తన వందో చిత్రంపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టారు.



# 'ఖల్‌నాయక్ రిటర్న్స్'లో ఐటెం సాంగ్

సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోలీ కే పీచే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వందార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నా పలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతం విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.